



# ప్రజా వాయిస్

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE


WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 51 | ఎడిటర్: మేనం శ్యామ్ | బుధవారం 09-09-2026 | పేజీలు: 10


## సిరా చుక్క


తుపాకీ తుటాలు అక్కర్లేదు,
అణుబాంబుల మోతలు అసలే వద్దు,
ఖరీదైన ఆయుధాల దండయాత్రలు
ఈ దేశాన్ని కూల్చడానికి అవసరమే లేదు!
తెల్లటి ఖద్దరు చొక్కాల చాటు
నల్లటి నైజం దాచుకున్న
నాయకులు చాలు,
ఓట్ల వేటలో నీతులు వల్లించి
సీటు దక్కగానే నాశనం చేయడానికి!
స్వార్థపు రాజకీయాల విషపు గాలి పీల్చి,
అభివృద్ధిని అవినీతి కోరలకు బలిచేస్తూ...
సరిహద్దు శత్రువుల కంటే వేగంగా
దేశపు పునాదులనే తొలిచేస్తున్నారు!
బాంబులు తీసేది ప్రాణాలు మాత్రమే,
ఈ 'తెల్ల బాబులు' తీసేది ఏకంగా
దేశపు భవిష్యత్తే.

రాగిపని బ్రహ్మచారి. ....
నల్గొండ..



# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలకు రంగం సిద్ధం

- సభలో మంత్రి కీలక తీర్మానం
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలకు రంగం సిద్ధం
- అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై అధికార పక్షం తీవ్ర అభ్యంతరం
- ఇద్దరు ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సభలో తీర్మానం
- కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మంత్రి దామోదర రాజనర్సింహ డిమాండ్
- తీర్మానానికి సంపూర్ణ మద్దతు తెలిపిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క






**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో** :తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు శాసనసభలో మంత్రి దామోదర రాజనర్సింహ కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఎమ్మెల్సీలు స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలతో పాటు అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై అధికార పక్షం తీవ్రంగా స్పందించింది.

**ఇద్దరు ఎమ్మెల్సీలపై కఠిన చర్యలకు తీర్మానం..**

మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టిన తీర్మానంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇద్దరు ఎమ్మెల్సీలపై సభ తరఫున కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ సభ్యులు, నేతలు వ్యవహరించిన తీరుపై విపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కూడా డిమాండ్ చేశారు.సభలో మాట్లాడిన మంత్రి.. ఎస్సీల చరిత్ర కేవలం ఒక వర్గానికి సంబంధించినది కాదని, అది జాతి ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. తమకు అవమానాలు, పోరాటాలు కొత్తకాదని పేర్కొన్నారు.

**ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే తీవ్ర పరిణామాలు..**

దళితుల చరిత్ర అంటే పోరాటాల చరిత్ర, ఆత్మగౌరవ చరిత్ర అని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ''ఆత్మగౌరవమే మా అలంకారం.. ఆత్మగౌరవమే మా స్ఫూర్తి'' అంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఆ ఆత్మగౌరవంతోనే తాము ఇక్కడి వరకు వచ్చామని చెప్పారు.ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తెలంగాణ యువతను, ముఖ్యంగా దళిత సమాజాన్ని తక్కువగా అంచనా వేయొద్దని సూచించారు.

**స్పీకర్ స్థానం ఎవరి కులానికీ, మతానికీ కాదు..**

ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, అయితే రాజ్యాంగబద్ధ వ్యవస్థలను, అత్యున్నత పదవుల్లో ఉన్నవారి హుందాతనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని మంత్రి అన్నారు. స్పీకర్ స్థానం ఏ ఒక్క కులానికో, మతానికో చెందినది కాదని స్పష్టం చేశారు.అలాంటి

మిగతా 2లో

# కేసీఆర్‌కు రక్షణ లేదా..?

- ఫామ్‌హౌస్ వైపు కేటీఆర్ పయనం.. అరెస్ట్
- కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ శ్రేణుల పిలుపుతో ఉద్రిక్తత
- కేసీఆర్‌కు రక్షణగా ఎర్రవల్లి వెళ్లిన కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు
- హకీంపేట వద్ద అడ్డుకుని బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు
- కేసీఆర్ హత్యకు కుట్ర జరిగిందంటూ కేటీఆర్ సంచలన ఆరోపణలు
- కాంగ్రెస్ శ్రేణులను వదిలేసి బీఆర్ఎస్ నేతలనే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శ



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో** :బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. కాంగ్రెస్ వర్గాలు ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో.. కేసీఆర్‌కు మద్దతుగా, ఆయనను పరామర్శించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలు ఎర్రవల్లి బయలుదేరారు. అయితే హకీంపేట వద్ద పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేశారు.

**కేసీఆర్‌పై హత్యకు కుట్ర జరిగిందా?**

ఈ సందర్భంగా కేటీఆర్ సంచలన

మిగతా 2లో

## అసెంబ్లీలో మానవీయ ఘటన

- అస్వస్థతకు గురైన రాజుకు మంత్రి శ్రీహరి సీపీఆర్
- అసెంబ్లీ ఆవరణలో అకస్మాత్తుగా కుప్పకూలిన సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ వ్యక్తిగత కార్యదర్శి రాజు
- వెంటనే స్పందించి సీపీఆర్ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి
- వైద్య సిబ్బందిని పిలిపించి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలింపు
- ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజు
- మంత్రి సమయస్ఫూర్తిపై అసెంబ్లీ సిబ్బంది, అధికారుల ప్రశంసలు



2 లో

# అసెంబ్లీ, మండలిలో ఇదేం రాజకీయం?

## బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు

- ప్రజా సమస్యలపై చర్చించాల్సిన చట్టసభలు విమర్శలకు వేదికలుగా మారాయని ఆవేదన
- స్పీకర్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన బండి సంజయ్
- రాజకీయ విభేదాలున్నా రాజ్యాంగబద్ధ పదవులకు గౌరవం ఇవ్వాలని సూచన
- మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారశైలిని తప్పుబట్టిన కేంద్ర మంత్రి
- బాధ్యులపై చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో** :తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న వేళ కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారాలు చూపాల్సిన శాసనసభ, శాసనమండలి ప్రస్తుతం విమర్శలు, ప్రతివిమర్శలు, అనుచిత వ్యాఖ్యలు, దాడులకు వేదికగా మారడం బాధాకరమని అన్నారు.

**చట్టసభల్లో ఇదేం రాజకీయం?**

ప్రజల సమస్యలపై చర్చించి

మిగతా 2లో


## తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలకు భారీ ఊరట

- రిమాండ్ తిరస్కరించిన నాంపల్లి కోర్టు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీల రిమాండ్ పిటిషన్‌ను తిరస్కరించిన నాంపల్లి కోర్టు
- వ్యక్తిగత పూచీకత్తుపై ఇద్దరినీ విడుదల చేయాలని ఆదేశం
- ఒక్కొక్కరు రూ.10 వేల చొప్పున పూచీకత్తు, రెండు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశాలు
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు, పోలీసులతో దురుసు ప్రవర్తన ఆరోపణలపై అరెస్ట్
- అసెంబ్లీ ఘటనపై హైకోర్టులోనూ కొనసాగుతున్న విచారణ

2 లో

## కేసీఆర్‌పై వీర్లపల్లి శంకర్ సంచలన వ్యాఖ్యలు

- బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు
- కేసీఆర్ మరణాన్ని కోరుకుంటున్నామంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారని బీఆర్ఎస్ ఆరోపణ
- ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ నిరసనల నేపథ్యంలో వివాదం
- వీర్లపల్లి శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- వ్యాఖ్యలు వ్యక్తిగతమైనవి కావని, సీఎం రేవంత్‌రెడ్డి వైఖరికి ప్రతిబింబమని వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపణ



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో** :కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి చేసిన తీవ్ర వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి. కేసీఆర్ మరణాన్ని

మిగతా 2లో

## అసెంబ్లీలో మాటల తూటాలు

## మహిళా ఎమ్మెల్యేల అంశంపై హరీశ్‌రావు ఫైర్

- మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరిగిందంటూ హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు
- సీఎం రేవంత్‌రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి
- హరీశ్‌రావు వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్
- విచారణలో తప్పు తేలితే చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ
- 22ఏ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణకు బీజేపీ డిమాండ్



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో** : తెలంగాణ శాసనసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు పేలాయి. సోమవారం అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనలు, స్పీకర్

మిగతా 2లో

## బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద రణరంగం

- బీఆర్ ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణ
- కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు బీఆర్ ఎస్ నేతల అరెస్ట్ నేపథ్యంలో ఉద్రిక్తత
- భారీగా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్న బీఆర్ ఎస్ కార్యకర్తలు
- కాంగ్రెస్ శ్రేణులు రావడంతో ఇరువర్గాల మధ్య నినాదాలు, వాగ్వాదం
- రాళ్లు, కుర్చీలు విసురుకోవడంతో పలువురికి గాయాలు
- పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు అదనపు బలగాల మోహరింపు

2 లో

# బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద రణరంగం

హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :హైదరాబాద్ బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావుతో పాటు పలువురు ఆ పార్టీ ముఖ్య నేతలను పోలీసులు అరెస్ట్ చేసి నగరంలోని వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తరలించిన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు.

**నేతల అరెస్ట్‌తో బీఆర్ఎస్ ఆందోళన..**

తమ పార్టీ నేతలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరడంతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**కాంగ్రెస్ శ్రేణులు రావడంతో ఉద్రిక్తత..**

బీఆర్ఎస్ కార్యకర్తల ఆందోళన కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య పరస్పరం నినాదాలు, వాగ్వాదం చోటుచేసుకున్నాయి. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు ఇరువర్గాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు.



**రాళ్లు, కుర్చీలు విసురుకున్న కార్యకర్తలు..**

ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకోవడంతో పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చింది. కొందరు కార్యకర్తలు రాళ్లు, కుర్చీలు విసురుకున్నట్లు తెలుస్తోంది. దీంతో బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిసరాలు ఒక్కసారిగా రణరంగంగా మారిపోయాయి. ఈ ఘటనలో పలువురికి గాయాలైనట్లు సమాచారం. కాంగ్రెస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు గాయపడినట్లు తెలుస్తుండగా.. ఓ మహిళా కార్యకర్త చేతికి తీవ్ర గాయమైందని, చేయి విరిగినట్లు సమాచారం.

# అసెంబ్లీలో మానవీయ ఘటన



**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణ శాసనసభ ఆవరణలో మంగళవారం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ వ్యక్తిగత కార్యదర్శి రాజు అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మంత్రి వాకిటి శ్రీహరి వెంటనే స్పందించి ఆయనకు ప్రాథమిక వైద్యం అందించారు.

**వెంటనే సీపీఆర్ చేసిన మంత్రి...రాజు**

కిందపడిపోవడాన్ని గమనించిన మంత్రి శ్రీహరి ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆయన వద్దకు చేరుకున్నారు. వెంటనే సీపీఆర్ నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందిని అక్కడికి రప్పించి అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

**అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలింపు...**

రాజు పరిస్థితిని గమనించిన మంత్రి.. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అంబులెన్స్‌ను పిలిపించారు. అనంతరం రాజును మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. వైద్యులు ఆయన ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

**మంత్రి సమయస్ఫూర్తిపై ప్రశంసలు..**

సాధారణంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో మంత్రు లు, ఎమ్మెల్యేలు, అధికారులు, సిబ్బందితో శాసనసభ ప్రాంగణం రద్దీగా ఉంటుంది. ఇలాంటి సమయంలో ఎవరైనా అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైతే తక్షణ వైద్య సహాయం కీలకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో మంత్రి వాకిటి శ్రీహరి స్పందించిన తీరు అసెంబ్లీ సిబ్బంది, అధికారులు, అక్కడున్న వారిని ఆకట్టుకుంది. అత్యవసర సమయంలో సమయస్ఫూర్తితో స్పందించి సహాయం అందించిన మంత్రిపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

**స్పీకర్‌ను పరామర్శించిన సీఎం, డిప్యూటీ సీఎం..**

ఇదిలా ఉండగా.. అసెంబ్లీ సమావేశాల తొలి రోజు జరిగిన ఉద్రిక్త పరిణామాల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి పరామర్శించారు. సోమవారం జరిగిన పరిణామాలపై సీఎం విచారం వ్యక్తం చేసి, ప్రభుత్వ పరంగా పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. స్పీకర్‌పై వచ్చిన ఆరోపణలు, అసెంబ్లీ ఆవరణలో జరిగిన నిరసనల నేపథ్యంలో ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సభా మర్యాదలు, రాజ్యాంగబద్ధ పదవుల గౌరవ పరిరక్షణపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

# మహిళా ఎమ్మెల్యేల అంశంపై హరీశ్‌రావు ఫైర్

**మొదటి పేజీ తరువాయి**

స్థానాన్ని అవమానించారనే ఆరోపణల నేపథ్యంలో మంగళవారం సభ తీవ్ర ఉద్రిక్తంగా మారింది. సభ ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు వేర్వేరు అంశాలపై నినాదాలతో హోరెత్తించడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నల్ల రిబ్బన్లు ధరించి మండలికి హాజరై నిరసన తెలిపారు.

**మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరిగిందన్న హరీశ్‌రావు..**

సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతున్న సమయంలో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అసెంబ్లీ ఆవరణలో తమ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించారని ఆరోపించారు. సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికారని, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి అవమానించారని ఆయన ఆరోపించారు. న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే.. రక్షణ కల్పించాల్సిన పోలీసులే తమపై రివర్స్ కేసులు పెట్టారని హరీశ్‌రావు ఆరోపించారు. ఘటనను యావత్ తెలంగాణ మహిళలపై జరిగిన దాడిగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

**రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు తీవ్ర వ్యాఖ్యలు..**

చట్టసభ గౌరవ సభగా ఉండాల్సింది పోయి కౌరవ సభగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి కలియుగ దుశ్శాసనుడిలా వ్యవహరిస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆనాడు కౌరవులకు పట్టిన గతే రేపు కాంగ్రెస్ పార్టీకి పడుతుందని హెచ్చరించారు.

**హరీశ్‌రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆగ్రహం..**

హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్ సభ్యుల నినాదాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. "మీరు లొల్లి పెడితే నేను భయపడను" అని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ మహిళా నేతలను ఉద్దేశించి సబితమ్మ, సునీతమ్మ, కోవా లక్ష్మి అంటే తనకు అత్యంత గౌరవమని, వారు తనకు తోబుట్టువులతో సమానమని చెప్పారు. సబితా ఇంద్రారెడ్డికి జరిగిన ఘటనపై తానే స్వయంగా విచారణ జరిపించాలని అధికారులను కోరినట్లు తెలిపారు.అయితే తనపై జరిగిన అవమానాన్ని కూడా ప్రస్తావించిన స్పీకర్.. ‘‘హరీశ్‌రావు.. ముందు నన్ను అవమానించిన అంశంపై మాట్లాడు! నా పట్ల అసభ్యంగా ప్రవర్తించారు, నా కన్న తల్లిదండ్రులను అవమానకరంగా మాట్లాడారు’’ అంటూ అసహనం వ్యక్తం చేశారు.

**తప్పు తేలితే చర్యలు: శ్రీధర్‌బాబు..**

వివాదంపై శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారు. సోమవారం జరిగిన ఘటనలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పోలీసు అధికారులను ఆదేశించారని తెలిపారు.సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలతో కలిసి పనిచేసిన అనుభవం తమకు ఉందని, తమ ప్రభుత్వానికి మహిళల పట్ల పూర్తి గౌరవం ఉందని చెప్పారు. విచారణలో తప్పు జరిగినట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అయితే స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తిపై, ఆయన తల్లిదండ్రులపై బీఆర్ఎస్ సభ్యులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించకపోవడం సరికాదని మంత్రి అన్నారు.

# కేసీఆర్‌కు రక్షణ లేదా..?

**మొదటి పేజీ తరువాయి**

ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్‌పై కుట్రపూరితంగా హత్యాయత్నానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలను అక్కడి వరకు పోలీసులు ఎలా అనుమతించారని ప్రశ్నించారు. అదే సమయంలో తమ సొంత నాయకుడి నివాసానికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. ఈ వ్యవహారంపై డీజీపీ వివరణ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**పోలీసులపై కేటీఆర్ తీవ్ర విమర్శలు...**

ఫామ్‌హౌస్‌కు వెళ్తున్న సమయంలో పోలీసులు కేటీఆర్‌ను అదుపులోకి తీసుకుని బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ మీడియాతో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ శ్రేణులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నాయకులను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. కేసీఆర్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు.కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద వందలాది మంది పోలీసులను మోహరించామని అధికారులు చెబుతున్నప్పటికీ.. తమ నాయకుడి భద్రత విషయంలో పోలీసులపై నమ్మకం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తమ నాయకుడిని తామే కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

**బొల్లారం నుంచి పాదయాత్ర.. అరెస్టులు..**

అసెంబ్లీ నుంచి కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎర్రవల్లి బయలుదేరారు. తొలుత బొల్లారం వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం హకీంపేట వద్ద కేటీఆర్, హరీశ్‌రావులను నిలిపివేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.కేసీఆర్ ఇంటి వైపు వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులకు అనుమతి ఇచ్చారా అని కేటీఆర్ పోలీసులను ప్రశ్నించారు. కేసీఆర్ నివాసం వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని పోలీసులు వివరించినప్పటికీ బీఆర్ఎస్ నేతలు వెనక్కి తగ్గలేదు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు పాదయాత్రగా బయలుదేరారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని జవహర్‌నగర్, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

**ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు...**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రతిపక్షాలపై దృష్టి పెట్టిందని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు తెరలేపిందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని అన్నారు.అసెంబ్లీ సమావేశాల తీరుపైనా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించడానికే సభను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఒక రోజు రాజకీయ విమర్శలకు కేటాయించి, మిగిలిన సమయాన్ని ప్రజా సమస్యలపై చర్చించేందుకు వినియోగించాలని సూచించారు. దళితులపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు.కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతల అరెస్ట్‌తో మేడ్చల్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా బలగాలను మోహరించారు.

# తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలకు భారీ ఊరట

**హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :** తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలకు నాంపల్లి కోర్టులో భారీ ఊరట లభించింది. పోలీసులు కోరిన రిమాండ్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుపై ఇద్దరినీ విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది.

**స్పీకర్‌పై వ్యాఖ్యలు.. పోలీసులతో దురుసు ప్రవర్తన...**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో పాటు విధుల్లో ఉన్న పోలీసులతో దురుసుగా వ్యవహరించారనే అభియోగాలపై పోలీసులు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను మంగళవారం ఉదయం అరెస్ట్ చేశారు. అనంతరం వారిని నాంపల్లి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించాలని పోలీసులు కోరారు.

**రిమాండ్ తిరస్కరించిన న్యాయస్థానం..**

ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ఎమ్మెల్సీలను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయాలని ఆదేశించింది. ఒక్కొక్కరు రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించడంతో పాటు రెండు ష్యూరిటీలు ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది. అవసరమైన పూచీకత్తు, ష్యూరిటీలు సమర్పించిన అనంతరం వారిద్దరినీ విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది.

**అసెంబ్లీ ఘటన దృశ్యాలు కోర్టు ముందుకు...**

విచారణ సందర్భంగా అసెంబ్లీ వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన దృశ్యాలను అసెంబ్లీ న్యాయ బృందం కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. వాటిని పరిశీలించిన అనంతరం న్యాయస్థానం ఇరుపక్షాల వాదనలు విన్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీల తరఫు న్యాయవాదులు ఈ కేసులు రాజకీయ కక్షసాధింపులో భాగంగా నమోదు



చేశారని వాదించినట్లు సమాచారం.మరోవైపు పోలీసులు కేసు నమోదు చేయడానికి గల కారణాలను కోర్టుకు వివరించారు. విధుల్లో ఉన్న పోలీసులు, మహిళా కానిస్టేబుళ్లను నెట్టివేయడంతో పాటు దూషించారని ప్రభుత్వం ఆరోపించినట్లు తెలుస్తోంది.

**హైకోర్టులోనూ కొనసాగుతున్న పరిణామాలు..**

అసెంబ్లీ వద్ద సోమవారం జరిగిన ఘటనపై తెలంగాణ హైకోర్టులోనూ పరిణామాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దని, ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.ఈ ఉత్తర్వులను సవరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎదుట బైఠాయించి ప్లకార్డులతో నిరసన తెలిపారని, ప్రభుత్వ వ్యతిరేక రాతలతో కూడిన నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారని ఏజీ కోర్టుకు వివరించినట్లు తెలుస్తోంది.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే పోలీసులు వారిని అడ్డుకున్నారని ప్రభుత్వం వాదించింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిబంధనలు ఉల్లంఘించారని, నిషేధాజ్ఞలను పాటించలేదని ఏజీ కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉన్నప్పటికీ, స్పీకర్ ఆదేశాల మేరకే పోలీసులు వారిని అడ్డుకున్నారని ప్రభుత్వం పేర్కొన్నట్లు తెలుస్తోంది.

# అసెంబ్లీ, మండలిలో ఇదేం రాజకీయం?
# బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు

**మొదటి పేజీ తరువాయి**

పరిష్కార మార్గాలు చూపాల్సిన చట్టసభలు రాజకీయ విమర్శలకు కేంద్రాలుగా మారడం సరికాదని బండి సంజయ్ అన్నారు. ప్రజా ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సభల్లో వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు.రాజకీయ విభేదాలు సహజమే అయినప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధ పదవులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు.

**స్పీకర్‌పై వ్యాఖ్యలను ఖండించిన బండి సంజయ్**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. స్పీకర్ వంటి కీలక పదవిలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి భాష ఉపయోగించడం నీచంగా, సిగ్గుచేటుగా ఉందని మండిపడ్డారు.పదవుల్లో ఉన్న వ్యక్తులపై వ్యక్తిగత విమర్శలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. రాజకీయంగా ఎంతటి విభేదాలున్నా చట్టసభల గౌరవాన్ని, స్పీకర్ స్థాన ఔన్నత్యాన్ని కాపాడాలని సూచించారు.

**మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరును ఖండిస్తూ..**

మహిళా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషంగా ఉందని బండి సంజయ్ ఆరోపించారు. సీనియర్ నాయకులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలకు ఎదురైన ఘటనలను ఆయన ప్రస్తావించారు.ప్రజా ప్రతినిధులతో పోలీసులు గౌరవప్రదంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన ఘటనలు ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనలు, అసెంబ్లీలో చోటుచేసుకున్న అనుచిత వ్యాఖ్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.ప్రజాస్వామ్యంలో చట్టసభలకు, ప్రజాప్రతినిధులకు గౌరవం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# మహిళా పోలీసులను పరామర్శించిన మంత్రి సీతక్క

- ధైర్యంగా ఉండండి.. ప్రభుత్వం అండగా ఉంటుంది
- అసెంబ్లీ గేటు వద్ద గాయపడిన మహిళా పోలీసులను పరామర్శించిన మంత్రి సీతక్క
- ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను మంత్రికి వివరించిన మహిళా పోలీసు అధికారులు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపణ
- విధి నిర్వహణలో ఎదురైన ఇబ్బందులను సీతక్కకు వివరించిన మహిళా పోలీసులు
- బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదంటూ మంత్రి భరోసా



హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో :తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జరిగిన ఘటనలో గాయపడిన మహిళా పోలీసులను మంత్రి సీతక్క పరామర్శించారు. జరిగిన పరిణామాలకు సంబంధించిన పూర్తి వివరాలను మహిళా పోలీసు అధికారులు మంత్రికి వివరించారు. విధి నిర్వహణలో తమకు ఎదురైన ఇబ్బందులను, కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రవర్తనను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

**అసభ్యంగా తాకారు.. టీషర్టులు విసిరారు..**

కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించారని మహిళా పోలీసులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను అసభ్యంగా తాకారని ఆరోపిస్తూ.. అందుకు సంబంధించిన ఫొటోలు, దృశ్యాలను మంత్రికి చూపించి ఫిర్యాదు చేశారు.మా డ్యూటీలు మేము చేస్తుంటే టీషర్టులు విసిరేసి మా మీదికి వచ్చారు. విధి నిర్వహణలో మేము చాలా ఇబ్బందులు పడ్డాం అని మహిళా పోలీసులు వివరించినట్లు సమాచారం. తాము అధికారంలోకి వచ్చాక అంతు చూస్తామని కొందరు బెదిరించారని కూడా వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలకు రంగం సిద్ధం

**మొదటి పేజీ తరువాయి**

అత్యున్నత పీఠంపై కూర్చున్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని నేరమని దామోదర రాజనర్సింహ మండిపడ్డారు. అధికారంలో లేకపోయినా బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని విమర్శించారు. ప్రజా జీవితంలో ఉన్నవారు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని హితవు పలికారు

**తీర్మానానికి భట్టి విక్రమార్క మద్దతు..**

మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పూర్తిగా బలపరిచారు. రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం తరఫున కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.తీర్మానం పూర్తయిన అనంతరం ఎమ్మెల్సీలపై చర్యలకు సంబంధించిన అధికారిక తీర్మాన కాపీని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపనున్నారు. అనంతరం మండలిలో ఆమోదం పొందిన తర్వాత తదుపరి నిర్ణయాన్ని అమలు చేయనున్నారు.

# కేసీఆర్‌పై వీర్లపల్లి శంకర్ సంచలన వ్యాఖ్యలు

**మొదటి పేజీ తరువాయి**

కోరుకుంటున్నామంటూ ఆయన వ్యాఖ్యలు చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై గులాబీ పార్టీ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడుతూ.. ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి నేపథ్యంలో వివాదం..**

అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు తీవ్రంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ శ్రేణులు ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి ప్రయత్నించిన నేపథ్యంలో వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి కేంద్రంగా మారాయి.కేసీఆర్ ఇంటి వద్ద వెయ్యి డప్పులు మాత్రమే కాకుండా.. అవసరమైతే చావు డప్పు కూడా కొడతామంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యానించినట్లు బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. తెలంగాణకు పట్టిన శని కేసీఆర్ అంటూ ఆయన విమర్శలు చేసినట్లు ఆరోపించారు. బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధి స్థాయిలో ఉన్న వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయ నేతపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు.

**బీఆర్ఎస్ నేతల తీవ్ర ఆగ్రహం..**

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. శంకర్ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత మాటలు కాదని.. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు ప్రతిబింబమని ఆరోపించారు. కేసీఆర్ మరణాన్ని కోరుకుంటున్నారని చెప్పించేందుకు అధికార పార్టీ నేతలను ఉపయోగిస్తున్నారని విమర్శించారు.కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు వీర్లపల్లి శంకర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్గాలు డిమాండ్ చేశాయి. గతంలో అసెంబ్లీలో వేముల వీరేశం చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ కూడా ప్రశాంత్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. కేసీఆర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు.

**బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు..**

కాంగ్రెస్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోలీసులను ఆశ్రయించారు. వీర్లపల్లి శంకర్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ ప్రాణహాని కోరుకునే విధంగా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. వ్యాఖ్యలపై సమగ్రంగా దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

**రాజకీయంగా మరింత ముదిరిన వివాదం..**

మరోవైపు కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డప్పులతో వెళ్లిన ఘటనపై కూడా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నేతలు ఫామ్‌హౌస్ వైపు వెళ్లడం, పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడం వంటి పరిణామాలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి.తాజా వ్యాఖ్యలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. కేసీఆర్ భద్రత విషయంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా.. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.




# ఆశాలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

- రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ కు ఎన్నికల్లో గుణపాఠం తప్పదు
- బీఆర్ టీయూ జిల్లా అధ్యక్షుడు టైగర్ కృష్ణయ్య

**ప్రజావాయిస్/వికారాబాద్:** ఆశా కార్మికులకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత, సంక్షేమ బోర్డు ఏర్పాటు తదితర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టైగర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆశా కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, 1000 రోజులు దాటినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కృష్ణయ్య విమర్శించారు. ప్రస్తుతం అందుతున్న రూ.10 వేల వేతనంతో పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఇంటి అద్దెలు, విద్యా ఖర్చులతో ఆశా కార్మికులు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు.హామీలను వెంటనే అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, డీఎంహెచ్‌ఓలకు వినతిపత్రం అందజేశారు. అధికారులు సానుకూలంగా స్పందించారు.కార్యక్రమంలో ఆశా కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు మంజుల, ప్రధాన కార్యదర్శి కే.అనిత, జమున, విజయలక్ష్మి, జ్యోతి, శ్యామల తదితరులతో పాటు వందలాది మంది ఆశా కార్మికులు పాల్గొన్నారు.




# స్పీకర్ గౌరవం కోసం గళమెత్తిన మిర్యాలగూడ

- రాజ్యాంగంతో రోడ్డెక్కిన ఎమ్మెల్యే బత్తుల
- తాతా మధుసూదన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన దళిత సంఘాలు, కాంగ్రెస్ శ్రేణులు
- ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వరకు డప్పులతో భారీ ర్యాలీ
- స్పీకర్ ను అవమానించడం అంటే శాసనసభ, రాజ్యాంగాన్ని అవమానించడమే
- తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.

**ప్రజా వాయిస్, మిర్యాలగూడ.** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలు రాజకీయ విమర్శల పరిధిని దాటి రాజ్యాంగబద్ధమైన పదవి గౌరవాన్నే ప్రశ్నించే స్థాయికి చేరాయని ఆరోపిస్తూ మిర్యాలగూడలో దళిత సంఘాలు, కాంగ్రెస్ నాయకులు భారీ నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (BLR) ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు డప్పులతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. చేతిలో భారత రాజ్యాంగాన్ని పట్టుకున్న BLR.. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదని, శాసనసభా వ్యవస్థను, రాజ్యాంగ విలువలను అవమానించడమేనని అన్నారు. సభాపతికి గౌరవం ఇవ్వడం ప్రతి సభ్యుడి బాధ్యత అని, ఇలాంటి భాషను ఉపయోగించిన ఎమ్మెల్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలోనూ బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్, ఇతర ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించారని ఆరోపించిన BLR.. ఈసారి చర్యలు లేకపోతే శాసనసభ గౌరవంపై తప్పుడు సంకేతాలు వెళ్తాయని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ వ్యవహారంపై స్పందించి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం కేటీఆర్, హరీష్‌రావు, తాతా మధుసూదన్‌ల దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా "ఇది ఒక స్పీకర్ గౌరవం కోసం జరిగిన పోరాటం మాత్రమే కాదు.. రాజ్యాంగం ఇచ్చిన పదవుల గౌరవాన్ని కాపాడుకునే పోరాటం" అంటూ కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

# డిజిటల్ కంచెలో పేదోడి పైసలు!

- కాగితాలు ఉన్నా కరుణించని ఇన్సురెన్స్ కంపెని?
- ప్రజావాణి మెట్లెక్కిన బాదితుడు ఎల్లయ్య గోడు!
- స్పందించి హామీ ఇచ్చిన స్థానిక ఎంపీడీఓ యర్రయ్య!



**ప్రజా వాయిస్ ఖమ్మం:** మనిషి చనిపోయి పుష్కర కాలం దాటుతున్నా, నిబంధనల పేరుతో వ్యవస్థ ఆ పేద కుటుంబాన్ని ఇంకా వెంటాడుతూనే ఉంది. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం, మంద్రాజుపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి ఎల్లయ్య కుమారుడు రమేష్ 2013లో వ్యవసాయ బావిలో పడి ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయాడు. అప్పట్లో పంచాయతీ అధికారులు విచారణ జరిపి అధికారిక మరణ ధ్రువీకరణ పత్రం అందించారు. చేతికందిన కొడుకును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో కాలం వెళ్లదీసిన ఆ వృద్ధ తండ్రి, కొడుకు పేరిట ఉన్న ఎల్ఐసీ పాలసీ గడువు ముగియడంతో రావాల్సిన కాసింత సొమ్ము కోసం ఆఫీస్ మెట్లెక్కాడు. కానీ అక్కడి అధికారుల తీరు చూసి బిత్తరపోవడం ఆయన వంతైంది. చనిపోయిన నీ కొడుకు ఆధార్ కార్డు కావాలి.. చేతితో రాసిన మరణ ధ్రువికరణ కాగితం కుదరదు, ఆన్‌లైన్ డిజిటల్ డెత్ సర్టిఫికెట్ తేవాల్సిందే అంటూ వెనక్కి పంపారు . 2013 నాటికి ఆధార్ తప్పనిసరి కాదన్న ఇంగితం గానీ, అప్పట్లో పంచాయతీల్లో ఆన్‌లైన్ పోర్టల్స్ లేవన్న కనీస స్పృహ గానీ నిబంధనల కంచె దాటలేకపోయాయి. ఈ విషయం పై ఎల్లయ్య సోమవారం ప్రజావాణిలో అధికారుల ముందు కన్నీరుమున్నీరయ్యాడు. స్పందించిన స్థానిక ఎంపీడీఓ యర్రయ్య ఇది సాంకేతిక లోపమని, పాత రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎల్ఐసీ వారితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మనుషుల కోసం నిబంధనలు ఉండాలి కానీ, నిబంధనల కోసమే మనుషులు బతకాలన్నట్లు తయారైన ఈ వ్యవస్థీకృత జాడ్యం మారేదెన్నడో చూడాలి.

# పినపాక గడ్డపై 'రాజీనామా' రచ్చ.!

- కేసీఆర్ రాజీనామా చేయాలన్న ఎమ్మెల్యే పాయం
- గతం మరిచి మాట్లాడొద్దంటూ బీఆర్ ఎస్ కౌంటర్
- ఆరు గ్యారెంటీలు అమలు చేసి దమ్ముంటే ప్రజల ముందుకు రావాలన్న గులాబీ నేతలు
- రేగా కాంతారావు వరుస ప్రశ్నలు




**ఆరోగ్యారంటీలు అమలు చేస్తే వచ్చే ఎన్నికల్లో అసలు మేము పోటీనే చేయము ? రేగా**

**ప్రజా వాయిస్,భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్,బీఆర్ఎస్ మధ్య రాజకీయ మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం లేదంటూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిరసనకు దిగడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. దీనిపై బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు తీవ్రంగా స్పందిస్తూ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న పాయం ఇప్పుడు రాజీనామా డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు.

## కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి.?

కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా పినపాక అంబేద్కర్ సెంటర్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిరసన తెలిపారు. ప్రతిపక్ష నేతగా ఉంటూ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా జీతభత్యాలు, ఇతర సౌకర్యాలు పొందడం ద్వారా ప్రజాధనం వృథా అవుతోందని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యలపై సభకు వచ్చి మాట్లాడాలని, లేనిపక్షంలో కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## గతం మరిచి మాట్లాడొద్దు

ఎమ్మెల్యే పాయం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా స్పందించాయి. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో పాయం వెంకటేశ్వర్లు పనిచేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. అప్పట్లో ప్రభుత్వ పథకాలను ప్రశంసించి, కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఇప్పుడు అదే నేత రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమని విమర్శించారు.గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో పినపాక నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చూపించాలి' అని బీఆర్ఎస్ నేతలు సవాల్ విసిరారు. దమ్ముంటే కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రజల ముందుకు రావాలని డిమాండ్ చేశారు.

## ఆరు గ్యారెంటీలపై నిలదీత

మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, రైతు భరోసా, కౌలు రైతులకు ఆర్థిక సాయం, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు, కల్యాణలక్ష్మి,షాదీముబారక్‌కు తులం బంగారం వంటి హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. హామీల అమలుపై ప్రజల్లో అసంతృప్తి ఉన్న సమయంలో గత ప్రభుత్వాన్ని విమర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

## రేగా కాంతారావు వరుస ప్రశ్నలు

ఇదే అంశంపై మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ప్రశ్నించారు. కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించిన ఆయన.. దళిత బంధు ద్వారా అర్హులకు ఆర్థిక సాయం చేసినందుకా, పోడు భూములకు పట్టాలు ఇచ్చినందుకా, కల్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాలు అమలు చేసినందుకా, తాగునీటి ప్రాజెక్టులు నిర్మించినందుకా రాజీనామా చేయాలంటూ నిలదీశారు.అదేవిధంగా విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, రైతులకు ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, నియోజకవర్గాల్లో ఆసుపత్రులు, జిల్లాల్లో కలెక్టరేట్లు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందుకా కేసీఆర్ రాజీనామా చేయాలని ప్రశ్నించారు.

## ప్రచారాలు కాదు.. అభివృద్ధి చూపించండి

ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం మానేసి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రేగా కాంతారావు సూచించారు. గత ప్రభుత్వంలో జరిగిన లోపాలను పదేపదే ప్రస్తావించడం కంటే ప్రస్తుత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని అన్నారు. దీంతో పినపాకలో కాంగ్రెస్,బీఆర్ఎస్ మధ్య 'రాజీనామా' రాజకీయాలు మరింత వేడెక్కాయి.



# ఇందారంలో లారీలే టార్గెట్..!

- రాత్రికి రాత్రే బ్యాటరీలు, జాబులు, పానలు మాయం
- వరుస చోరీలతో లారీ యజమానుల్లో భయాందోళన
- పోలీసు గస్తీ పెంచాలని డిమాండ్

**ప్రజా వాయిస్,జైపూర్:** జైపూర్ మండలం ఇందారం గ్రామంలో దొంగలు రెచ్చిపోతున్నారు. గ్రామ శివార్లు, రోడ్ల పక్కన రాత్రివేళ నిలిపి ఉంచిన లారీలను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్నట్లు లారీ యజమానులు, డ్రైవర్లు చెబుతున్నారు. లారీల్లోని ఖరీదైన బ్యాటరీలు, టైర్ల మార్పిడికి ఉపయోగించే జాబులు, పానలు, ఇతర ఇనుప సామాగ్రిని దొంగలు ఎత్తుకెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రాత్రి వేళల్లోనే చోరీలు

లారీలు ఎవరూ లేని సమయంలో దొంగలు చాకచక్యంగా బ్యాటరీ బాక్సులను ధ్వంసం చేసి బ్యాటరీలను అపహరిస్తున్నట్లు సమాచారం. ఒక్కో బ్యాటరీ విలువ వేల రూపాయలు ఉండటంతో బాధితులకు గణనీయమైన నష్టం వాటిల్లుతోంది. వరుస ఘటనలతో లారీ యజమానులు, డ్రైవర్లు రాత్రివేళ లారీలను నిలిపేందుకు భయపడుతున్నారు.

## పోలీసు గస్తీ పెంచాలి

ఇప్పటికే పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. చోరీలకు పాల్పడుతున్న ముఠాను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, రాత్రివేళ గ్రామ శివార్లు, లారీలు నిలిపే ప్రాంతాల్లో పోలీసు గస్తీ పెంచాలని లారీ యజమానులు, గ్రామస్తులు కోరుతున్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చోరీలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# మృతి 17న.. ధ్రువీకరణ 10న

- మరణ ధ్రువీకరణ పత్రం జారీలో తేడాలపై ఆరోపణలు
- మున్సిపల్ అధికారుల తీరుపై పట్టణ వాసుల ఆగ్రహం


FORM No.6
తెలంగాణ ప్రభుత్వము
GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF MUNICIPAL ADMINISTRATION
వైద్య ఆరోగ్యశాఖ
MEDICAL & HEALTH DEPARTMENT
మరణ ధ్రువ పత్రము
DEATH CERTIFICATE

(Issued under Section 12/17 of the Registration of Births and Deaths Act 1969 and Rules 8/13 of the Telangana Registration of Births and Deaths Rules 1999)

This is to certify that the following information has been taken from the original record of death which is in the register for (local area / local body) ENUMAMULA CIRCLE 10 OF WARANGAL MUNICIPAL CORPORATION OF WARANGAL DISTRICT OF STATE OF TELANGANA

| | |
|---|---|
| Sex | MALE |
| Date of Death (DD/MM/YYYY) | 10/08/2026 |
| Place of Death | WARANGAL |
| Name of Mother | NA |
| Name of the Father/Husband | RAMULU |
| Address of the Deceased at the time of Death | NA |
| Date of Registration (DD/MM/YYYY) | 28/08/2026 |
| Date Of Issue (DD/MM/YYYY) | 28/08/2026 |

Application No:
Certified By


**ప్రజా వాయిస్,హన్మకొండ:** మున్సిపల్ కార్యాలయంలో మరణ ధ్రువీకరణ పత్రాల జారీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2026 ఆగస్టు 17న ఓ వ్యక్తి మృతి చెందగా.. ఆగస్టు 10న మృతి చెందినట్లు మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్లు పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. మృతి తేదీకి, ధ్రువీకరణ పత్రంలో నమోదైన తేదీకి వ్యత్యాసం ఉండటంపై వారు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

## ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టి సారించాలి

ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపించాలని పట్టణవాసులు కోరుతున్నారు.తప్పుడు పత్రాలు జారీ చేసినట్లు విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.మున్సిపాలిటీలో ధ్రువీకరణ పత్రాలజారీ ప్రక్రియను పరిశీలించడంతో పాటు అవినీతి నిరోధక శాఖ అధికారులు కూడా దృష్టి సారించాలని కోరుతున్నారు.

# ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో న్యాయం చేయండి

- మంథని ఆర్డీవో పై చర్యలు తీసుకోండి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సింగిరెడ్డిపల్లి నిర్వాసితుడి వినతి
- సమస్య వినకుండా అనుచితంగా వ్యవహరించారని ఆవేదన
- ఉన్నత స్థాయి విచారణకు డిమాండ్




**ప్రజా వాయిస్ మంథని** సింగరేణి బొగ్గు గని విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోయిన తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలులో తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రశ్నించడానికి వెళ్లిన తనపై మంథని ఆర్డీఓ అనుచితంగా ప్రవర్తించారని పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన భూ నిర్వాసితుడు రేనుకుంట నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గోదావరిఖని 11 ఇన్‌క్లైన్ సింగరేణి విస్తరణలో భాగంగా తమ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయని నరేష్ తెలిపారు. 2008 కటాఫ్ తేదీ ఆధారంగా అర్హులైన ప్రతి నిర్వాసిత కుటుంబానికి సమానంగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించాల్సి ఉండగా, అర్హులకు న్యాయం జరగడం లేదని ఆయన ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై ఉన్నత స్థాయి స్వతంత్ర విచారణ జరిపించి, 2008 కటాఫ్ తేదీ ప్రకారం అర్హులైన నిర్వాసితులకు పరిపరిహారం అందించాలని, అలాగే నిర్వాసితుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన మంథని ఆర్డీఓపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.ఈ సమస్యపై మాట్లాడేందుకు ఆగస్టు 25న మంథని ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లగా, ఆర్డీఓ తన సమస్యను కనీసం వినకుండా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లాలని గద్దించారని బాధితుడు తెలిపారు. నా ఇష్టం వచ్చినట్లు చేస్తాను, మీ దిక్కున్న వారికి చెప్పుకోండి అంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని వాపోయారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికారి ఈ రీతిలో వ్యవహరించడం పట్ల విచారం వ్యక్తం చేశారు.

# నిషేధిత భూముల్లో ఇటుక బట్టీల దందా.!

- పేదల భూములపై అక్రమార్కుల కన్ను..
- చర్యలు తీసుకోవాలంటూ రూరల్ తహసీల్దార్ కు ఫిర్యాదు

**ప్రజా వాయిస్,యాపల్‌గూడ**/ఆదిలాబాద్:ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ పరిధిలోని ప్రొహిబిటెడ్ (నిషేధిత) భూముల్లో అక్రమంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవీందర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రూరల్ తహసీల్దార్ గోవింద్‌కు ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు టౌన్ ప్రెసిడెంట్ బాస సంతోష్ ఉన్నారు.పేదల బతుకుదెరువు కోసం ప్రభుత్వం కేటాయించిన భూములను అక్రమార్కులు స్వాధీనం చేసుకోవడం సరికాదని తాళ్ల రవీందర్ అన్నారు. నిషేధిత భూముల్లో ఇటుక బట్టీల నిర్వహణకు సంబంధించి అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన చేపట్టాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా భూములను వినియోగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అక్రమంగా ఆక్రమణకు గురైన భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుని, అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని తాళ్ల రవీందర్ కోరారు. ఈ వ్యవహారంపై అధికారులు తక్షణమే స్పందించి బాధిత పేదలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.





# స్పీకర్‌పై వ్యాఖ్యలు దుమారం

- వికారాబాద్ లో బీఆర్ ఎస్ పై కాంగ్రెస్ ఆగ్రహం
- తాతా మధు వ్యాఖ్యలపై తీవ్ర నిరసన
- భారీ ర్యాలీ, దిష్టిబొమ్మల దహనం
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు బీఆర్ ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలి
- మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య



**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:**తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వికారాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి ఎంఆర్‌పీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం స్థానిక ఎన్టీఆర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గడ్డం అనన్య మాట్లాడుతూ.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని, వారిని ఎమ్మెల్సీ పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, తాతా మధు తదితరులు స్పీకర్‌కు క్షమాపణలు చెప్పాలని కోరారు."ప్రసాద్ కుమార్ కు ఎవరూ లేరని అనుకోవద్దు. ఆయనకు, మా కుటుంబానికి వేలాది కాంగ్రెస్ కుటుంబాలు అండగా ఉన్నాయి. తాతా మధు జాగ్రత్తగా ఉండాలి" అని అనన్య హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు తమను అవమానించినప్పటికీ తాము ఇప్పటివరకు శాంతియుతంగానే స్పందిస్తున్నామని తెలిపారు.స్పీకర్ ప్రసాద్ కుమార్ సంస్కారం కలిగిన నాయకుడని, రాజకీయాల్లో చిన్నప్పటి నుంచే కష్టపడి మచ్చలేని నాయకుడిగా ఎదిగి శాసనసభ స్పీకర్ స్థాయికి చేరుకున్నారని అనన్య అన్నారు. స్పీకర్ పదవికి, ఆయన వయస్సుకు కూడా గౌరవం ఇవ్వకుండా చేసిన వ్యాఖ్యలు బాధాకరమని పేర్కొన్నారు."నిన్న జరిగిన ఘటన తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక చీకటి రోజుగా మిగిలిపోతుంది. రాష్ట్ర ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. సరైన సమయంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారు" అని ఆమె వ్యాఖ్యానించారు.

### సబితారెడ్డిని మా కుటుంబసభ్యురాలుగా భావిస్తాం

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తనకు చిన్నప్పటి నుంచే పరిచయమని, ఆమెను కుటుంబ సభ్యురాలిగా గౌరవిస్తామని అనన్య తెలిపారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత గౌరవాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ధారాసింగ్ జాదవ్‌తో పాటు వికారాబాద్, మర్పల్లి, దారూర్,కోట్ పల్లి,ఏఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రభుత్వ బడులపై ఇంత నిర్లక్ష్యమా..?

- విరిగిన గేట్లు.. కోతులు, కుక్కల బెడద
- విద్యార్థుల భద్రత గాలిలో
- పాఠశాల దుస్థితిపై తక్షణమే స్పందించాలి
- ఎంఈఓ, డీఈఓ పర్యవేక్షణపై తల్లిదండ్రుల ప్రశ్నలు
- పిల్లలకు ఏదైనా జరిగితేనే అధికారులు మేల్కొంటారా..?

**ప్రజా వాయిస్/కొడకండ్ల:**కొడకండ్ల మండలంలోని ఏడు మాతల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సురక్షిత వాతావరణం కరువైందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల భద్రతకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అధికారులు పాఠశాల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.పాఠశాల ఆవరణలోని గేట్లు దెబ్బతిని విరిగిపోయే పరిస్థితికి చేరుకోవడంతో విద్యార్థుల భద్రతపై ఆందోళన నెలకొంది. మరోవైపు పాఠశాల ప్రాంగణంలోకి కోతులు, కుక్కలు వస్తుండటంతో చిన్నారులకు ప్రమాదం పొంచి ఉందని తల్లిదండ్రులు చెబుతున్నారు. పిల్లలను బడికి పంపాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

### భోజన వసతులపైనా ఫిర్యాదులు

మధ్యాహ్న భోజనానికి సంబంధించి కూడా తగిన వసతులు లేవని కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పలుమార్లు సంబంధిత ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కనిపించలేదని చెబుతున్నారు. పాఠశాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని విమర్శిస్తున్నారు.

### ప్రమాదం జరిగితేనే మేల్కొంటారా..?

పాఠశాల ప్రధాన గేటు సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని స్థానికులు అంటున్నారు. విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాతే అధికారులు స్పందిస్తారా అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల పరిస్థితులను ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, భద్రతాపరమైన లోపాలను వెంటనే సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### ప్రైవేటు బడులపై ప్రేమ.. ప్రభుత్వ బడులపై ఎందుకు నిర్లక్ష్యం..?

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తే తల్లిదండ్రుల్లో ప్రభుత్వ బడులపై నమ్మకం మరింత తగ్గే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల వైపు వెళ్లి, ప్రభుత్వ బడులు క్రమంగా విద్యార్థులు లేక వెలవెలబోయే పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తున్నారు.ఇప్పటికైనా ఎంఈఓ, డీఈఓతో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలను పరిశీలించి, గేటు మరమ్మతులు, పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజన వసతులు, విద్యార్థుల భద్రతకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ధరణి రిజిస్ట్రేషన్లలో ప్రైవేట్ దందా..?

- జూనియర్ అసిస్టెంట్ లాగిన్ తో ప్రైవేట్ వ్యక్తి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న ఆరోపణలు
- దగ్గరుండి ప్రక్రియను చేయిస్తున్న డిప్యూటీ తహసీల్దార్
- సిబ్బంది కొరతే కారణమంటున్న అధికారులు



**ప్రజా వాయిస్,ఆత్మకూరు (ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) తహసీల్దార్ కార్యాలయంలో ధరణి రిజిస్ట్రేషన్ల నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది కాకుండా ఓ ప్రైవేట్ వ్యక్తి రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పాల్గొంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా జూనియర్ అసిస్టెంట్ లాగిన్‌ను ఉపయోగించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు సమాచారం. దీంతో కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారంపై చర్చ మొదలైంది.

### ప్రైవేట్ వ్యక్తిని ప్రశ్నించగా..

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న సమయంలో ప్రైవేట్ వ్యక్తిని ప్రశ్నించగా.. తాను కార్యాలయ ఉద్యోగినేనని చెప్పినట్లు తెలిసింది. మరోవైపు డిప్యూటీ తహసీల్దార్ దగ్గరుండి సదరు వ్యక్తితో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను చేయిస్తున్నట్లు ఆరోపణలు రావడం మరింత చర్చనీయాంశంగా మారింది.

### సిబ్బంది కొరతే కారణమా..?

కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతోనే ప్రైవేట్ వ్యక్తితో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ చెబుతున్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వ కార్యాలయంలో అత్యంత కీలకమైన భూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రైవేట్ వ్యక్తులతో నిర్వహించడం నిబంధనలకు అనుగుణమేనా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### అధికారిక లాగిన్ .. అనధికారిక వినియోగమా..?

జూనియర్ అసిస్టెంట్ పేరిట ఉన్న అధికారిక లాగిన్‌ను ఇతర వ్యక్తులు వినియోగిస్తున్నారా? ప్రైవేట్ వ్యక్తికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో భాగస్వామ్యం కల్పించడానికి ఉన్న నిబంధనలు ఏమిటి? ఉన్నతాధికారుల అనుమతి ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి..

ధరణి రిజిస్ట్రేషన్ల వంటి కీలకమైన ప్రభుత్వ ప్రక్రియలో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారిక లాగిన్‌ల వినియోగం, రిజిస్ట్రేషన్ల నిర్వహణపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# వరకట్న వేధింపుల కేసులో ముగ్గురికి జైలు శిక్ష

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులోనూ దోషులుగా నిర్ధారణ
- ఒక్కొక్కరికి 3.6 ఏళ్ల శిక్ష, రూ.2 వేల జరిమానా



**ప్రజా వాయిస్, నల్లగొండ క్రైమ్:** వరకట్న వేధింపులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులో ముగ్గురు నిందితులకు నల్లగొండ జిల్లా ప్రత్యేక సెషన్స్ కోర్టు 3 సంవత్సరాల 6 నెలల జైలు శిక్ష విధించింది. ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా, ముగ్గురికి కలిపి రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ తెలిపారు.నిడమనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2023లో నమోదైన క్రైమ్ నంబర్ 45/2023 కేసు తదుపరి SC.No.34/2024గా కోర్టులో విచారణకు వచ్చింది. ఈ కేసులో కారంపూడి శ్రీను (31), కారంపూడి ఉషారాణి (57), కారంపూడి సత్యనారాయణ (63) నిందితులుగా ఉన్నారు. కేసు విచారణలో IPC 323, 504, 494 సెక్షన్ల కింద నమోదైన అభియోగాల నుంచి నిందితులను కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. అయితే IPC 498–Aతో పాటు ఎస్సీ/ఎస్టీ (అట్రాసిటీస్ నివారణ) చట్టం–1989లోని సెక్షన్ 3(1)(r)(s) కింద నిందితులు దోషులుగా నిర్ధారించింది.IPC 498–A కింద ఒక్కొక్కరికి మూడేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.1,000 జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 15 రోజుల జైలు శిక్ష విధించింది. ఎస్సీ/ఎస్టీ చట్టం కింద ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో మరో 15 రోజుల జైలు శిక్ష విధించింది. రెండు శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని కోర్టు ఆదేశించింది.

### దర్యాప్తు బృందానికి ఎస్పీ అభినందన

కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితులకు శిక్ష పడేలా సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించిన అప్పటి నిడమనూరు ఎస్ఐ ఎం.శోభన్, మిర్యాలగూడ ఎస్‌డీపీవో పి.వెంకటగిరితో పాటు ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించిన ఎస్సీ/ఎస్టీ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్–1 ఎస్.శోభారాణి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్–1 ఆర్.అఖిలను ఎస్పీ అభినందించారు. కేసు కోర్టు విచారణలో సమన్వయంతో పనిచేసిన హోలియా సీఐ ఎస్.రాఘవరావు, మిర్యాలగూడ ఎస్‌డీపీవో జి.రవి, నిడమనూరు ఎస్ఐ డి.విజయ్‌కుమార్, డీసీఆర్‌బీ సీఐ శ్రీనునాయక్, సీడీఓ ఆర్.రవీందర్ రాథోడ్, లైజన్ అధికారులు హెచ్.పి.నరేందర్, పీసీ ఎన్.మల్లికార్జున్‌లను కూడా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# స్పీకర్‌పై వ్యాఖ్యలకు కాంగ్రెస్ నిరసన

- తాత మధు దిష్టిబొమ్మ దహనం
- క్షమాపణ చెప్పాలని డిమాండ్

**ప్రజా వాయిస్,శంషాబాద్:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శంషాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తాత మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాత మధు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తాత మధుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# కంటి వైద్య రివ్యూ శిబిరానికి అనూహ్య స్పందన

- కంటి పరీక్షలకు క్యూ కట్టిన వృద్ధులు
- 52 మందికి ఆపరేషన్లకు ఎంపిక

**ప్రజా వాయిస్,మునుగోడు**.కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ ప్రజల కోసం ఆగస్టు 2న నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్లకు ఎంపికై శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి మంగళవారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రివ్యూ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న 95 మందికి మరోసారి కంటి పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స అనంతరం కళ్ల పనితీరును వైద్యులు పరిశీలించారు. ఇదే శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న కొత్తవారికి కూడా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించగా 195 మంది పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 52 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేయగా, 51 మందిని వెంటనే కంటి ఆపరేషన్ల కోసం హైదరాబాద్‌కు తరలించారు. మరో 127 మందికి కళ్లజోళ్ల అవసరం ఉన్నట్లు వైద్యులు గుర్తించి, వారికి వచ్చేవారం కళ్లజోళ్లను పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉచిత కంటి వైద్య సేవలకు పెద్ద సంఖ్యలో వృద్ధులు తరలివచ్చి పరీక్షలు చేయించుకోవడంతో శిబిరానికి అనూహ్య స్పందన లభించింది.

# ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని ప్రతి ఒక్కరూ సహకరించాలి

- ప్రజా వాయిస్ లో వచ్చిన కథనానికి కదిలిన మంథని మున్సిపాలిటీ
- ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై వ్యాపారులకు అవగాహన

**ప్రజా వాయిస్ మంథని**మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై పట్టణంలోని వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో,మున్సిపల్ కమిషనర్ ఎన్. మనోహర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాలను వ్యాపారులకు వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహితమైన వస్తువులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పెంటరి రాజు, ఎల్లంకి వంశీధర్, మున్సిపల్ సిబ్బంది, పట్టణ వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.







# స్పీకర్‌పై వ్యాఖ్యలు రాజ్యాంగ వ్యవస్థను అవమానించడమే

- ఎమ్మెల్సీ తాత మధు వెంటనే బేషరతుగా స్పీకర్ కు క్షమాపణ చెప్పాలి
- మండల సర్పంచుల సంఘం అధ్యక్షురాలు డాక నీలమ్మ మహేశ్వర్ రెడ్డి

**ప్రజావాయిస్/కోట్ పల్లి:** తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, కించపరిచే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కోట్ పల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ నీలమ్మ మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్‌పై ఈ విధంగా మాట్లాడటం సరికాదన్నారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై చేసిన వ్యాఖ్యలు కాదని, రాజ్యాంగ వ్యవస్థను, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు.సభా ప్రాంగణంలోనే ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, ప్రజాస్వామ్య విలువలకు ఇది విరుద్ధమన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఎమ్మెల్సీ తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు తెలంగాణ ప్రజలకు, శాసనసభకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే ఈ ఘటనపై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో కోట్ పల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తలారి మాధవ్, మహేశ్వర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అబ్దుల్ నబీ,మాజీ ఎంపీటీసీ ప్రతాపరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి,బిచ్చయ్య , ఫరీద్, బిచ్చయ్య,లవ్ కుమార్, బుజ్జమ్మ,అజ్జు, శివ కుమార్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట అభివృద్ధిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ.!

- వెయ్యి రోజుల పాలనలో చేసిందేమిటో చెప్పాలి..
- నిధులన్నీ గత ప్రభుత్వంలో మంజూరైనవే: బీఆర్ ఎస్
- పల్లె నుంచి పట్నం దాకా అభివృద్ధి కనిపించదా.?
- ముఖాముఖి చర్చకు సిద్ధం: కాంగ్రెస్
- రెండు పార్టీల మాటల యుద్ధంతో వేడెక్కిన అశ్వారావుపేట
- కొత్త నాయకత్వం కోసం ప్రజల ఎదురుచూపు



**ప్రజా వాయిస్,అశ్వారావుపేట:** అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు రోజురోజుకూ ముదురుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు అభివృద్ధి అంశాన్ని కేంద్రంగా చేసుకుని పరస్పరం సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకోవడంతో నియోజకవర్గంలో రాజకీయ వేడి రాజుకుంటోంది. బీఆర్ఎస్ చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ.. వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు చెప్పుకోదగ్గ ప్రయోజనం చేకూరలేదని ఆరోపిస్తున్నారు.అశ్వారావుపేట పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం స్వయంగా కొత్తగా నిధులు తీసుకువచ్చిన దాఖలాలు లేవని బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం కనిపిస్తున్న పలు అభివృద్ధి పనులు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మంజూరైనవని పేర్కొంటున్నారు. దీనికి కాంగ్రెస్ నాయకులు దీటుగా స్పందిస్తూ.. పల్లె నుంచి పట్నం వరకు జరుగుతున్న అభివృద్ధిని కళ్లుండి చూడకుండా బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడుతున్నారు.

## ముఖాముఖికి సిద్ధం.. మీరు సిద్ధమేనా.?

వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి సుమారు రూ.36 కోట్ల నిధులు, నేషనల్ ఇంటీరియర్ స్కూల్ అభివృద్ధి, మినీ పార్కులు, ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు, వంతెనలు, పట్టణ రింగ్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ వంటి పనులు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. అభివృద్ధి కనిపించడం లేదంటున్న బీఆర్ఎస్ నేతలు అవసరమైతే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసురుతున్నారు.

## మంజూరు మాది.. ప్రచారం మీది

కాంగ్రెస్ విమర్శలకు బీఆర్ఎస్ నాయకులు కూడా గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రి స్థాయిలో కృషి చేసి పట్టణ, నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించారని అంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఘనతగా చెబుతున్న అనేక పనులకు గత ప్రభుత్వమే నిధులు మంజూరు చేసిందని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అశ్వారావుపేటకు కొత్తగా వచ్చిన పెద్ద ప్రాజెక్టు ఏదో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

## గుమ్మడవెల్లి ప్రాజెక్టుపై మాటల మంట

గుమ్మడవెల్లి ప్రాజెక్టు అంశం కూడా ఇరు పార్టీల మధ్య విమర్శలకు కారణమవుతోంది. ప్రాజెక్టు దెబ్బతినడంతో సుమారు ఐదు గ్రామాల ప్రజల జీవన విధానంపై ప్రభావం పడిందని, సుమారు 1,600 ఎకరాల భూములు సాగుకు దూరమయ్యాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. రెండో ఏడాది కొనసాగుతున్నా ప్రాజెక్టు పునరుద్ధరణపై ప్రస్తుత మంత్రులు, ఎమ్మెల్యేలు తగిన స్థాయిలో స్పందించడం లేదని విమర్శిస్తున్నారు.

## శిరీష కుటుంబానికి న్యాయం ఎప్పుడంటూ ప్రశ్న

ములకలపల్లి మండలంలో గిరిజన మహిళ శిరీషపై జరిగిన దారుణ ఘటనను కూడా బీఆర్ఎస్ నాయకులు ప్రస్తావిస్తున్నారు. కుటుంబానికి పూర్తిస్థాయి న్యాయం చేయకుండా పరిహారం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, వ్యవసాయ భూమి వంటి హామీలతో ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఆరోపిస్తున్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శిస్తున్నారు.

## ప్రజలే తేల్చాలంటున్న ఇరు పార్టీలు

మరోవైపు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ శాఖల్లో ప్రజలకు అందాల్సిన సేవలు సక్రమంగా అందడం లేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధుల అండతో కొందరు అధికారులు విధులను సక్రమంగా నిర్వహించడం లేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.మొత్తానికి అశ్వారావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి అంశం రాజకీయ అస్త్రంగా మారింది. 'అభివృద్ధి మాది' అంటూ కాంగ్రెస్.. 'నిధులు తెచ్చింది మేమే' అంటూ బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు, సవాళ్లతో ముందుకు సాగుతున్నాయి. ఇరు పార్టీల మధ్య సాగుతున్న ఈ మాటల యుద్ధం రానున్న రోజుల్లో ఎటు దారితీస్తుందో.. ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారో వేచి చూడాల్సిందే.

# పోలీస్ స్టేషన్ నుంచే పెట్రోలింగ్ ఇన్నోవా చోరీ.!

- రాత్రంతా నగరంలో చక్కర్లు..
- ఎల్కతుర్తి వద్ద ప్రమాదం
- వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు
- నిందితుడి అరెస్టుపై స్పష్టత కరువు



**ప్రజా వాయిస్, కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలో దొంగలు పోలీసులకే సవాల్ విసిరారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసుల పెట్రోలింగ్ వాహనాన్నే పోలీస్ స్టేషన్ నుంచి ఎత్తుకెళ్లిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పెట్రోలింగ్ ఇన్నోవాను అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసినట్లు సమాచారం.వాహనాన్ని తీసుకెళ్లిన అనంతరం సదరు వ్యక్తి రాత్రంతా నగరంలో చక్కర్లు కొట్టినట్లు తెలుస్తోంది. తెల్లవారుజామున వరంగల్ వైపు వెళ్తుండగా ఎల్కతుర్తి సమీపంలో ఇన్నోవా ప్రమాదానికి గురైనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అనంతరం చోరీకి గురైన ఇన్నోవాను సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించినట్లు సమాచారం.

## ఖాకీల పహారాపై ప్రశ్నలు.!

పోలీస్ స్టేషన్ నుంచే పెట్రోలింగ్ వాహనం చోరీకి గురికావడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పోలీసుల భద్రత, పహారా, వాహనాల నిర్వహణపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీస్ స్టేషన్‌లోనే వాహనానికి భద్రత లేకపోతే సాధారణ ప్రజలకు రక్షణ ఎలా ఉంటుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఇదిలా ఉండగా, పెట్రోలింగ్ వాహనాన్ని చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారా? లేదా? అనే విషయం ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. ఘటనకు సంబంధించి పోలీసులు పూర్తి వివరాలను వెల్లడించాల్సి ఉంది.



# మహిళా ఎమ్మెల్యేలపై దాష్టీకమా.!

- సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి
- పోలీసుల దౌర్జన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కోదాడలో బీఆర్ ఎస్ శ్రేణుల భారీ నిరసన
- సీఎం దిష్టిబొమ్మ దహనం

**ప్రజా వాయిస్,కోదాడ:** మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ కోదాడలో బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భారీ ధర్నా, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చేలా ఉందని మల్లయ్య యాదవ్ మండిపడ్డారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం అసెంబ్లీని పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



# కంచె చేను మేసిన చందంగా అధికారుల తీరు..?

- రేషన్ షాపుల వైపు కన్నెత్తి చూడని అధికారులు..?
- తంబు పెట్టు.. పైసలు తీసుకో' అంటూ బియ్యం కొనుగోళ్లకు తెరలేపిన డీలర్లు..?
- ఆత్మకూర్ మండలంలో జోరుగా రేషన్ బియ్యం దందా..!

**ప్రజా వాయిస్, హనుమకొండ** :కంచె చేను మేస్తే.. కాపు ఏం చేయాలి అన్న చందంగా అధికారుల పర్యవేక్షణ లోపం రేషన్ బియ్యం అక్రమ దందాకు ఊతమిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గంలోని ఆత్మకూర్ మండలంలో రేషన్ బియ్యం కొనుగోలు, విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే చర్చ స్థానికంగా జరుగుతోంది. పేదలకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని కొందరు రేషన్ డీలర్లే లబ్ధిదారుల నుంచి తిరిగి కొనుగోలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## తంబు పెట్టు..పైసలు తీసుకో..?

లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి నగదు చెల్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఆ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు, కోళ్ల ఫారాలకు తరలిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని పెంచికలపేట, పెద్దాపురం తదితర గ్రామాల్లో ఈ వ్యవహారం బహిరంగంగానే సాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## రేషన్ షాపులపై పర్యవేక్షణ ఏదీ..?

ప్రభుత్వ రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూడాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు, మండలస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. రేషన్ దుకాణాలపై నిరంతర పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల తీరుపై కూడా ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## కలెక్టర్ స్పందించాలి

రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ తక్షణమే దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులైన డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ఠమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# ఎనిమిది కుట్లు శరీరానికి.. వెయ్యి ప్రశ్నలు సర్కారుకు!

- ఫీజు బకాయిల విడుదల కోసం నెల రోజులుగా బీజేపీ, బీజేవైఎం ఆందోళన
- సర్కారు మొద్దు నిద్ర వీడకపోవడంతో అసెంబ్లీ ముట్టడి
- చేతికి కుట్లు పడ్డాయి.. కానీ మా పోరాటానికి బ్రేకులు పడలేదు అంటున్న శ్రీకాంత్

**మొయినాబాద్ (ప్రజావాయిస్ ):** చదువుకునే బిడ్డల ఫీజుల కోసం కదిలిన యువతను ఆపేది ఎవరు..? చేతికి గాయం చేసినా.. గుండెల్లోని గర్జనను ఆపలేరు! పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో గత నెల రోజులుగా ఆందోళనలు సాగుతున్నాయి.ఎన్ని రోజులుగా నిరసనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సోమవారం అసెంబ్లీ ముట్టడికి బీజేపీ,బీజేవైఎం శ్రేణులు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా జరిగిన ఆందోళనలో మొయినాబాద్ బీజేవైఎం నాయకుడు శాపురం శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి.చేతికి గాయం కావడంతో రక్తం కారుతుండగా ఆయనను కేర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గాయానికి వైద్యులు 8 కుట్లు వేశారు. చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న శ్రీకాంత్.. గాయం బాధను లెక్కచేయకుండా మరోసారి ఉద్యమ బాట పట్టారు.చేతికి కుట్లు పడ్డాయే తప్ప.. మా పోరాటానికి కుట్లు పడలేదు. రక్తం కారినా వెనక్కి తగ్గేది లేదు. విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు బీజేపీ, బీజేవైఎం పోరాటం ఆగదు అంటూ శ్రీకాంత్ స్పష్టం చేశారు.విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మొండి వైఖరి వీడకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే సీఎం గద్దె దించే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.






# మీసేవ ఒక్కటే.. తిప్పలు ఎన్నో.!

- మోతెలో రెండో మీసేవ కేంద్రం ఏది.?
- రైతులు, విద్యార్థుల అవస్థలు.. ధ్రువపత్రాల కోసం రోజుల తరబడి నిరీక్షణ
- వెంటనే మరో కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్

**మోతె, సెప్టెంబర్: ప్రజా వాయిస్**, సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలో ఒకే ఒక్క మీసేవ కేంద్రం ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కుల, ఆదాయం, నివాస ధ్రువపత్రాలతో పాటు వివిధ ప్రభుత్వ ఆన్‌లైన్ సేవల కోసం ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ ఒక్క కేంద్రాన్నే ఆశ్రయిస్తున్నారు. దీంతో రద్దీ పెరిగి, అవసరమైన ధ్రువపత్రాల కోసం రైతులు, విద్యార్థులు రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.గతంలో మోతె మండలంలో మరో మీసేవ కేంద్రం పనిచేసేది. అయితే ఆ కేంద్రం మూతపడటంతో ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ఒకే కేంద్రం ఆధారంగా మారింది. దరఖాస్తులు అధికం కావడంతో సేవలు ఆలస్యమవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అత్యవసరంగా ధ్రువపత్రాలు అవసరమైన విద్యార్థులు, రైతులు సమయం వృథా చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒకే మీసేవ కేంద్రంతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు సకాలంలో సేవలు అందించడం కష్టంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరో మీసేవ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## మరో మీసేవ కేంద్రం మంజూరు చేయాలి

మోతె మండల కేంద్రంలో వెంటనే మరో మీసేవ కేంద్రాన్ని మంజూరు చేసి ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా మరో మీసేవ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

# గుంతలు పూడ్చారు.. సమస్యను వదిలేశారు.!

- ప్రజా వాయిస్ కథనానికి స్పందించిన యాడ్ బ్లూ యాజమాన్యం
- తూతూమంత్రంగా మరమ్మతులు

**ప్రజా వాయిస్,పాల్వంచ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం రూరల్ పరిధిలోని నాగారం కాలనీ గ్రామపంచాయతీలో పాత ఆర్టీవో చెక్‌పోస్టు సమీపంలో ఉన్న యాడ్ బ్లూ కేంద్రం వద్ద రహదారి పరిస్థితిపై 'ప్రజా వాయిస్'లో సోమవారం ప్రచురితమైన కథనానికి యాజమాన్యం స్పందించింది. కేంద్రం వద్ద ఏర్పడిన గుంతలను హడావుడిగా పూడ్చివేసినప్పటికీ.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని స్థానికులు పేర్కొంటున్నారు.జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్న ఈ కేంద్రం వద్ద లారీలను రహదారిపైనే నిలిపివేస్తుండటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని స్థానికులు గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కథనం ప్రచురితం కావడంతో యాజమాన్యం గుంతలను పూడ్చే పనులు చేపట్టింది. అయితే, కేవలం గుంతలు పూడ్చడంతో సమస్య పరిష్కారం కాదని, లారీల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.తమ కేంద్రాన్ని జాతీయ రహదారిని ఆనుకుని ఏర్పాటు చేసుకునేందుకు గ్రామపంచాయతీ నుంచి ఎన్‌ఓసీ ఉందని యాజమాన్యం వెల్లడించింది. అయితే, రహదారికి ఆనుకుని నిర్మాణానికి అనుమతులు ఇచ్చే సమయంలో వాహనాల పార్కింగ్, రహదారి భద్రత వంటి అంశాలను అధికారులు పరిశీలించారా? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

## రహదారిపైనే లారీలు.. అధికారుల మౌనం

గత కొన్ని నెలలుగా రహదారిపైనే లారీలను నిలిపివేస్తున్నా ఆర్అండ్‌బీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రహదారిపై భారీ వాహనాల నిలిపివేతతో రాకపోకలకు ఇబ్బందులు కలగడమే కాకుండా ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన తర్వాతే అధికారులు స్పందిస్తారా? ప్రజల ప్రాణ భద్రతకు ఇంత ప్రాధాన్యత లేనట్టుగా వ్యవహరించడం సరికాదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి యాడ్ బ్లూ కేంద్రం వద్ద రహదారి భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు లారీల పార్కింగ్‌పై స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలని వారు కోరుతున్నారు.





## ఎమ్మెల్సీ తాత మధును తక్షణమే బర్తరఫ్ చేయాలి

- కాంగ్రెస్ నాయకుల పై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదు
- అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నేతలకు అహంకారం తగ్గలేదు
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి

**ప్రజా వాయిస్/ అడ్డగూడూరు:** రాజ్యాంగ బద్ధమైన పదవిలో కొనసాగుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై ఆయన కుటుంబ సభ్యులపై అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధును తక్షణమే భర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ నాయకులపై నోటికి వచ్చినట్లు ఏది పడితే అది మాట్లాడితే సహించేది లేదని అన్నారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేపట్టిన అర్ధనగ్న ప్రదర్శన దేనికి సంకేతం అన్నారు. దళిత స్పీకర్ అవమానించడం అంటే దళిత జాతిని, ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసినట్టేనని అన్నారు. బీఆర్ఎస్ నాయకులకు అధికారం కోల్పోయిన అహంకారం తగ్గలేదని అన్నారు. అహంకార ధోరణితో దళిత స్పీకర్ పై చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు. దళిత స్పీకర్ ను అవమానిస్తే బీఆర్ఎస్ పార్టీలో ఉన్న దళిత నాయకులు ఎందుకు స్పందించడం లేదని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు విద్యాసాగర్, సోమన్న, సర్పంచులు బాలశౌరి, లింగస్వామి, అంబేద్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమిరెడ్డి, జోజి, సత్యనారాయణ, మహేందర్, అశోక్ రెడ్డి, బీరుమల్లు, రాజశేఖర్ రెడ్డి, పవన్, అబ్బులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## మిల్లర్లు వర్సెస్ ప్రభుత్వం.. ధాన్యం తనిఖీలపై సమరం!

- నేటి నుంచి రైస్ మిల్లర్ల నిరవధిక సమ్మె
- భౌతిక తనిఖీల పేరుతో 25 శాతం జరిమానా
- 12 శాతం వడ్డీనా?
- అక్టోబర్ 30 వరకు గడువు ఇవ్వండి
- బియ్యం మొత్తం అప్పగిస్తాం: బాదం ప్రవీణ్.
- రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

**ములుగు జిల్లా, సెప్టెంబర్ 8** (ప్రజా వాయిస్):ధాన్యం భౌతిక తనిఖీలు, తరుగు, జరిమానాలు, బకాయిలు, బియ్యం అప్పగింతల్లో జాప్యం వంటి సమస్యలపై రైస్ మిల్లర్లు ప్రభుత్వంపై గళమెత్తారు. రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం పిలుపు మేరకు మంగళవారం నుంచి ములుగు జిల్లాలోని రైస్ మిల్లింగ్ కార్యకలాపాలను నిలిపివేసి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు ములుగు జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ప్రకటించారు. ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### "భౌతిక తనిఖీలు ఆపాలి:"

ధాన్యం భౌతిక తనిఖీల పేరుతో మిల్లర్లపై ఆర్థిక భారం మోపడం సరికాదని బాదం ప్రవీణ్ అన్నారు. ధాన్యం నెలల తరబడి నిల్వ ఉండటం వల్ల తేమ తగ్గడం, బరువు తగ్గడం, రంగు మారడం, దెబ్బతినడం వంటి కారణాలతో తరుగు ఏర్పడుతుందని తెలిపారు. ఎక్కడో ఒకచోట రెండు శాతం మేర లోపం జరిగితే దాన్ని అందరి మిల్లర్లకు ఆపాదించడం సరికాదన్నారు. ప్రస్తుతం కొన్ని మిల్లుల్లో 15 నుంచి 20 శాతం వరకు తరుగు ఉందని, దీనిని మిల్లర్ల తప్పిదంగా పరిగణించకుండా వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

### 25 శాతం జరిమానా.. 12 శాతం వడ్డీ?

భౌతిక తనిఖీల్లో ధాన్యం తక్కువగా ఉన్నట్లు తేలితే 25 శాతం జరిమానాతో పాటు 12 శాతం వడ్డీ విధిస్తున్నారని బాదం ప్రవీణ్ తెలిపారు. ఇప్పటికే నిర్వహణ వ్యయాలు పెరిగి మిల్లింగ్ పరిశ్రమ తీవ్ర ఒత్తిడిలో ఉందని, ఇలాంటి జరిమానాలు మరింత ఆర్థిక భారాన్ని పెంచుతున్నాయని అన్నారు. ఇదే విధానం కొనసాగితే రాష్ట్రంలో రైస్ మిల్లులు మూతపడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

### అక్టోబర్ 30 వరకు గడువు ఇవ్వండి:

ప్రభుత్వానికి బియ్యం అప్పగించేందుకు అక్టోబర్ 30 వరకు గడువు ఇవ్వాలని మిల్లర్లు కోరుతున్నారు.కేఎంఎస్ 2025–26 ఖరీఫ్ సీజన్లో ధాన్యం మిల్లులకు చేరిన తర్వాత సుమారు తొమ్మిది నెలల పాటు ప్రభుత్వం బియ్యం తీసుకోలేదని ప్రవీణ్ తెలిపారు. దీని వల్ల ధాన్యంలో తేమ తగ్గి బరువు తగ్గిందని, ఈ నష్టాన్ని మిల్లర్లపై మోపడం సరికాదని అన్నారు. "అక్టోబర్ 30 వరకు గడువు ఇవ్వండి. మిల్లింగ్ పూర్తి చేసి ప్రభుత్వానికి బియ్యం అప్పగిస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.

### ఉడికించిన బియ్యం ఎక్కడికి పంపాలి?

రబీ 2025–26 సీజన్లో వచ్చిన ఉడికించిన రకం ధాన్యాన్ని ఉడికించిన బియ్యం తయారు చేసే మిల్లుల్లోనే నిల్వ చేశామని తెలిపారు. ప్రస్తుతం ఉడికించిన బియ్యానికి తగిన లక్ష్యాలు లేకపోవడం, గోదాముల్లో స్థలం లేకపోవడం, బియ్యం తీసుకోవడంలో జాప్యం కారణంగా ధాన్యం పాడయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఉడికించిన బియ్యాన్ని తీసుకునేలా గోదాముల్లో స్థలం కల్పించాలని కోరారు.

### క్వింటాలుకు రూ.750 నుంచి రూ.1,000 వరకు నష్టం:

నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని ధాన్యం మిల్లులకు రావడం వల్ల అదనపు శుద్ధి చేయాల్సి వస్తోందని ప్రవీణ్ తెలిపారు. ఈ ప్రక్రియలో రంగు మారిన, దెబ్బతిన్న బియ్యం వస్తోందని, దాన్ని తక్కువ ధరకు విక్రయించాల్సి రావడంతో క్వింటాలుకు రూ.750 నుంచి రూ.1,000 వరకు నష్టం వస్తోందని పేర్కొన్నారు.

### "ప్రభుత్వమే మాకు కోట్ల రూపాయలు బకాయి:"

గత పదేళ్లుగా మిల్లింగ్, ఆరబెట్టడం, నిల్వ, రవాణా తదితర ఖర్చులకు సంబంధించిన బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని బాదం ప్రవీణ్ తెలిపారు.ఒకవైపు ప్రభుత్వం మిల్లర్లకు కోట్ల రూపాయలు బకాయి ఉండగా, మరోవైపు జరిమానాలు, వడ్డీల పేరుతో అదనపు భారం మోపడం సరికాదన్నారు.

### "మమ్మల్ని శత్రువులుగా చూడొద్దు.. భాగస్వాములుగా చూడండి"

"మమ్మల్ని శత్రువులుగా చూడొద్దు. ప్రభుత్వానికి సహకరించే భాగస్వాములుగా చూడండి. సన్న బియ్యం పథకానికి కూడా మేము సహకరిస్తున్నాం. మాపై వివక్ష లేకుండా న్యాయం చేయాలి"★★ అని బాదం ప్రవీణ్ ప్రభుత్వాన్ని కోరారు. భౌతిక తనిఖీలు నిలిపివేయకపోతే మిల్లింగ్ కార్యకలాపాలతో పాటు ప్రభుత్వానికి బియ్యం అప్పగింతలను కూడా నిలిపివేస్తామని ఆయన స్పష్టం చేశారు. మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్కు ముందస్తుగా సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి సహోదర రెడ్డి, కోశాధికారి మోహన్తో పాటు పలువురు మిల్లర్లు పాల్గొన్నారు.

# దేవరకొండలో దద్దరిల్లేలా కాంగ్రెస్ ప్రజా వికాస ర్యాలీ

- 5 వేల బైకులు.. 11 వేల మందితో భారీ ప్రదర్శన
- వెయ్యి రోజుల అభివృద్ధిని ప్రజల ముందుంచాం: ఎమ్మెల్యే బాలు నాయక్
- బీఆర్ ఎస్ కు ప్రజలే బైబై చెప్పారు



**ప్రజా వాయిస్ / దేవరకొండ** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా వికాస ర్యాలీ విజయవంతమైంది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (మార్కెట్ యార్డు) నుంచి బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన భారీ ర్యాలీలో సుమారు 5 వేల బైకులు, 11 వేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు. భారీ జనసందోహంతో దేవరకొండ పట్టణం కాంగ్రెస్ శ్రేణుల నినాదాలతో మార్మోగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. ''ఇది కేవలం బైక్ ర్యాలీ కాదు.. కాంగ్రెస్ ప్రజా పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతు. వెయ్యి రోజుల పాలనలో చేసిన అభివృద్ధికి ఇది నివేదిక. మా దగ్గర మాటలు మాత్రమే కాదు.. పనులు, గణాంకాలు, రికార్డులు ఉన్నాయి'' అని అన్నారు.

### రైతు సంక్షేమానికి పెద్దపీట

దేవరకొండ నియోజకవర్గంలో రూ.369 కోట్ల రైతు రుణమాఫీ జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించామని చెప్పారు. ఎస్ఎల్బీసీ,డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేసి చివరి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

### పేదల సంక్షేమమే ధ్యేయం

నియోజకవర్గంలో 15 వేల కొత్త రేషన్ కార్డులు అందించామని, ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 32,127 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోందన్నారు. దాదాపు 3 వేల ఇందిరమ్మ ఇళ్లు పూర్తయి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

### మహిళలు, విద్యార్థులకు ప్రాధాన్యం

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, దేవరకొండ డిపో పరిధిలో ఇప్పటివరకు ఆర్టీసీకి రూ.156 కోట్లు చెల్లించామని తెలిపారు. కులుమంతలప హాడ్ వద్ద రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు, దేవరకొండ ప్రభుత్వ హైస్కూల్‌ను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి చేయడం, ఐటీఐని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌గా మార్చడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు.



### 252 కిలోమీటర్ల రహదారులకు రూ.422 కోట్లు

ఆర్అండ్‌బీ ద్వారా 137 కిలోమీటర్ల రహదారులకు రూ.272 కోట్లు, పంచాయతీరాజ్ ద్వారా 115 కిలోమీటర్లకు రూ.150 కోట్లు.. మొత్తంగా 252 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.422 కోట్ల పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

### బీఆర్ ఎస్ కు ప్రజలే బైబై చెప్పారు

గత బీఆర్ఎస్ పాలనపై బాలు నాయక్ తీవ్ర విమర్శలు చేశారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు చేసిన పనులపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రజల మధ్య ఉండాల్సింది పోయి ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. కేటీఆర్, హరీశ్‌రావులది గాలి మాటల రాజకీయం. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు అని అన్నారు.దళితులకు మూడెకరాల భూమి, ప్రతి ఇంటికి ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇళ్ల హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. చేసిన పనికి కీర్తి రావాలి.. చేయని పనికి కీర్తి అడగొద్దు. ఎవరి హయాంలో ఏ పని జరిగిందో జీవోలు, శాంక్షన్లు, రికార్డులు చెబుతాయి. మాటలతో చరిత్ర మార్చలేరు అని స్పష్టం చేశారు.వెయ్యి రోజుల పాలన అంటే క్యాలెండర్‌లోని ఒక సంఖ్య కాదని, ప్రజల జీవితాల్లో కనిపిస్తున్న మార్పు అని బాలు నాయక్ అన్నారు. గతాన్ని రికార్డులతో, వర్తమానాన్ని పనులతో, భవిష్యత్తును ప్రణాళికతో నిర్మిద్దామని పేర్కొన్నారు. అభివృద్ధి కాగితాలపై కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# అనుమతులు గోరంత.. నిర్మాణాలు కొండంత.!

- అనధికార లేఅవుట్ లో యథేచ్ఛగా నిర్మాణాలు.. కుచించుకుపోతున్న నాలా
- వర్షాకాలంలోనూ భారీగా సెల్లార్ తవ్వకాలు.. పట్టించుకోని అధికారులు
- గడప దాటని నీటిపారుదల, రెవెన్యూ శాఖలు
- చూసీచూడనట్టు టౌన్ ప్లానింగ్ అధికారులు



**ప్రజా వాయిస్, రాజేంద్రనగర్:** గండిపేట మండలం నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండ డివిజన్ సాయి వైభవ్ లేఅవుట్‌లో నిర్మాణాల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. అనుమతులు లేని లేఅవుట్‌లోనే భారీ నిర్మాణాలు సాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. సహజ నీటి ప్రవాహానికి కీలకమైన నాలా ప్రాంతం క్రమంగా కుచించుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### నాలా పరిధిలోనూ తవ్వకాలు.!

మున్సిపల్ నిబంధనల ప్రకారం వర్షాకాలంలో భారీ సెల్లార్ తవ్వకాలు చేపట్టకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ.. సాయి వైభవ్ లేఅవుట్‌లో వాటిని బేఖాతరు చేస్తూ సెల్లార్ తవ్వకాలు కొనసాగుతున్నాయన్న ఫిర్యాదులు వస్తున్నాయి. నాలా పరిధిలో నిర్మాణాలు, తవ్వకాలపై స్థానికులు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### అధికారులు చూసీచూడనట్టేనా.?

నాలా పరిధి, నిర్మాణాల విషయంలో నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు కనీసం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సైతం నిర్మాణాలపై చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అనుమతులు లేని లేఅవుట్‌లో నిర్మాణాలకు అనుమతులు ఎలా వచ్చాయి నాలా పరిధిలో సెల్లార్ తవ్వకాలకు ఎవరు అనుమతిచ్చారు అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.



### హద్దులు తేల్చి.. చర్యలు తీసుకోవాలి

నాలా హద్దులను తక్షణమే నిర్ధారించి, సాయి వైభవ్ లేఅవుట్‌కు సంబంధించిన అనుమతులు, నిర్మాణ అనుమతులు, సంబంధిత ఎన్‌ఓసీలను అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# కల్తీ కోరల్లో ప్రజారోగ్యం




- బిర్యానీ నుంచి పాల వరకు సర్వం కల్తీ మయం
- కల్తీ లేని ఆహారం... ప్రజల హక్కు
- సురక్షిత ఆహారం అందించడం... ప్రభుత్వ బాధ్యత
- కల్తీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలి

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్, సెప్టెంబర్ 08** నేటి సమాజంలో ఆహార కల్తీ తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. మనం ప్రతిరోజూ వినియోగించే పాలు, నూనెలు, పప్పులు, మసాలాలు, స్వీట్లు, బేకరీ ఉత్పత్తులు, మాంసాహార పదార్థాలు, బిర్యానీ తదితర ఆహార పదార్థాల నాణ్యతపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కొంతమంది వ్యాపారులు అధిక లాభాల కోసం నాణ్యతా ప్రమాణాలను విస్మరించి, ఆహార పదార్థాల్లో నాసిరకం లేదా అనుచిత పదార్థాలను కలపడం, పాత ఆహారాన్ని తిరిగి విక్రయించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి చర్యలు వినియోగదారులను మోసం చేయడమే కాకుండా ప్రజల ప్రాణాలు, ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే చర్యలు.

### కల్తీ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు

ముఖ్యంగా కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల క్యాన్సర్, కిడ్నీ వైఫల్యం, లివర్ వ్యాధులు, గుండె జబ్బులు మరియు తీవ్రమైన జీర్ణకోశ సమస్యలు (ఫుడ్ పాయిజనింగ్) వచ్చే ప్రమాదం ఉంది.కల్తీ ఆహారం వల్ల తక్షణ ఆరోగ్య సమస్యలతో పాటు దీర్ఘకాలంలో కూడా తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

### తీసుకోవలసిన జాగ్రత్త

సాధ్యమైనంత వరకు బ్రాండెడ్ మరియు గుర్తింపు పొందిన (FSSAI ముద్ర ఉన్న) వస్తువులను కొనడం, నమ్మకమైన ప్రదేశాలలో ఆహారం తీసుకోవడం ద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

### హోటళ్లు, రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లలో తనిఖీలు చేయాలి

పాల విక్రయ కేంద్రాలు, స్వీట్ షాపులు, బేకరీలు, కిరాణా దుకాణాలను తనిఖీ చేయాలి. అనుమానాస్పద ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలి.కల్తీ నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి.ప్రజలకు కల్తీ ఆహారంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించే వ్యాపార సంస్థలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

### ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి

ఆహార పదార్థాలు కొనుగోలు చేసేటప్పుడు తయారీ తేదీ, గడువు తేదీ, ప్యాకేజింగ్, నాణ్యతా గుర్తులు తదితర అంశాలను పరిశీలించాలని ప్రజలకు సూచించాలి. అనుమానాస్పద ఆహార పదార్థాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.

### తక్షణ కార్యాచరణకు డిమాండ్

కల్తీ ఆహారంపై కేవలం తనిఖీలు నిర్వహించి, కేసులు నమోదు చేయడంతో సమస్య పరిష్కారం కాదని, కల్తీకి మూల కారణాలను గుర్తించి శాశ్వతంగా అరికట్టే విధంగా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అందులో భాగంగా సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి, హోటళ్లు, రెస్టారెంట్లు, పాల కేంద్రాలు, స్వీట్ షాపులు, బేకరీలు, ఆహార తయారీ కేంద్రాలు, గోదాములు, మార్కెట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. అనుమానాస్పద ఆహార పదార్థాల నమూనాలను సేకరించి వేగంగా ప్రయోగశాల పరీక్షలు నిర్వహించి, ఫలితాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలి.కల్తీ నిర్ధారణ అయిన సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, పునరావృతంగా నిబంధనలు ఉల్లంఘించే వ్యాపార సంస్థల లైసెన్సులను రద్దు చేసే చర్యలు చేపట్టాలి. అలాగే కల్తీ ఆహారం వల్ల ప్రజలకు నష్టం కలిగితే బాధ్యులపై బాధ్యతను నిర్ణయించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.అదే విధంగా, ప్రతి జిల్లాలో ప్రత్యేక ఫిర్యాదు వ్యవస్థను బలోపేతం చేసి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్దిష్ట కాలపరిమితిలో స్పందించే విధానాన్ని అమలు చేయాలి. కల్తీ నిరోధక చర్యలపై అధికారులు క్రమం తప్పకుండా ప్రజలకు నివేదిక ఇవ్వాలి.ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే కల్తీ వ్యాపారాన్ని ఇక ఏమాత్రం ఉపేక్షించకుండా, తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

### అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

వ్యాపారం చేయడం తప్పు కాదు.. కానీ లాభాల కోసం ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టడం మాత్రం క్షమించరాని నేరం.ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వంతో పాటు ప్రతి ఆహార వ్యాపారి బాధ్యత. కాబట్టి కల్తీ ఆహారంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలి సంబంధిత అధికారులు కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే కాకుండా నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి.

# సింగరేణి అప్పులకు బిఆర్ఎస్, కాంగ్రెస్ లే కారణం

## కార్మికుల్లో ఉనికి కోసమే విమర్శలు ఏఐటీయుసి కేంద్ర నాయకులు



**ప్రజా వాయిస్,గోదావరిఖని :**
సింగరేణి సంస్థ అప్పులపాలవ్వడానికి గత బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని,కార్మికుల్లో ఉనికి కోల్పోతామనే అక్కసుతోనే ఏఐటీయుసి పై పలు కార్మిక సంఘాలు విమర్శలు చేస్తున్నాయని ఏఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్, కే. వీరభద్రం లు విమర్శించారు. మంగళవారం ఆర్జీ వన్ ఏరియాలోని పలు గనుల వద్ద జరిగిన గేట్ మీటింగ్ లల్లో పాల్గొని మాట్లాడారు.జూన్ 8న యాజమాన్యానికి 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇవ్వడం వల్లే 24 డిమాండ్లపై ఒప్పందం కుదిరిందని, ఇలాంటి చారిత్రాత్మక ఒప్పందంపై అవగాహన లేకుండా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.సింగరేణిలో గుర్తింపు సంఘంగా 11 సంవత్సరాలు అధికారంలో ఉన్న టీబీజీకేఎస్ ఒక్క కొత్త గనిని తీసుకురాలేకపోయిందని, ఒక్క అగ్రిమెంట్ కూడా చేయలేదని, చట్ట ప్రకారం జరగాల్సిన స్ట్రక్చర్ కమిటీ, జేసీసీ సమావేశాలు నిర్వహించకుండా కాలం గడిపారని విమర్శించారు.సింగరేణి సొమ్మును అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విచ్చలవిడిగా వాడుకుంటే ఒక్క మాట అనని టీబీజీకేఎస్, 24 డిమాండ్లపై ఒప్పందం చేసుకుంటే హర్షించాల్సింది పోయి విమర్శించడం సరికాదన్నారు.అప్పటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణికి రూ. 56 వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడం వల్ల ప్రతి నెలా సింగరేణి బ్యాంకుల నుండి జీతాల కోసం అప్పు తీసుకోవాల్సి వస్తోందని, వెంటనే బకాయిలు చెల్లించాలని,కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



## బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ఏరియా ఇంజనీర్

- సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో ఉత్సాహంగా అంతర్గత క్రీడలు
- శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం
- కాశీ విశ్వేశ్వరరావు

**ప్రజా వాయిస్ గోదావరిఖని**
ఉద్యోగ ఒత్తిడి నుంచి ఉపశమనం పొంది శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సింగరేణి ఆర్జీ–1 ఏరియా ఇంజనీర్ కాశీ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. రామగుండం ఏరియా–1 పరిధిలోని సింగరేణి ఉద్యోగులకు స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న అంతర్గత బాల్ బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారం రెండో రోజు ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగాయి. ఈ పోటీలకు హాజరైన ఏరియా ఇంజనీర్, క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సింగరేణి ఉద్యోగుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు, వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు యాజమాన్యం ప్రతి ఏటా ఇటువంటి పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఆటగాళ్లు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి హనుమంతరావు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ గాండ్ల రాజయ్యతో పాటు వివిధ గనుల నుంచి వచ్చిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు, సింగరేణి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాలను అరెస్టులతో ఆపలేరు

### ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగితే అరెస్టు చేస్తారా
### సిఐటియు సీనియర్ నాయకులు ఆశన్న

**ప్రజా వాయిస్.. వీపనగండ్ల**
మంగళవారం రోజు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న ధర్నా సందర్భంగా ఆశా కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడానికి సిఐటియు సీనియర్ నాయకులు ఆశన్న ఖండించారు, వీపనగండ్ల పోలీస్ స్టేషన్ కి వెళ్లి ఆశా కార్యకర్తలకు ధైర్యం కల్పిస్తూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని తక్షణమే ఆశా కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు ఆశన్న మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు అందరూ అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, ఆశా వర్కర్లకు 18000 ఫిక్స్ వేతనం నిర్ణయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరు నెలల పిఆర్సి ఏరియర్స్ లేప్రసి సర్వే, పల్స్ పోలియో ,ఎలక్షన్ డ్యూటీ తదితర పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి, ఎన్ సి డి ఆన్లైన్ చేయించకూడదు, స్కూటం డబ్బాలు మోపించకూడదని, ఏ ఎన్ సి , పి ఎన్ సి ,తదితర టార్గెట్స్ ను రద్దు చేయాలి, ఆదివారం పండుగలకు సెలవులు, సంవత్సరానికి 20 క్యాజువల్ సెలవులు, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు నిర్ణయించాలని, ఏఎన్ఎం, జి ఎన్ ఎం, పోస్టులలో ఆశలకు ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలి, అని ఆయన అన్నారు. ఆగస్టు 14న ప్రజావాణిలో ఇచ్చిన వినతిపత్రంలోని డిమాండ్స్ అన్నిటిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సెప్టెంబర్ 8న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమంలో మండలంలోని ఆశా కార్యకర్తలు అందరూ కూడా పాల్గొంటున్న సందర్భంగా పోలీసులు ఎక్కడికి అక్కడ అరెస్టులు చేసి




స్టేషన్లకు తరలించడం అన్యాయమని అన్నారు, అరెస్ట్ అయిన ఆశా కార్యకర్తలు రాణి, రాధ, శ్యామలను తక్షణమే విడుదల చేయాలని అన్నారు, ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయకుంటే రానున్న కాలంలో అందర్నీ ఐక్యం చేసి ప్రజా ఉద్యమాలు నిర్వహించి హామీలు అమలు అయ్యేంతవరకు ప్రభుత్వం పై పోరాడుతం అని అన్నారు.






## పలిమెలలో ఏసీఎల్‌బీ విజయ లక్ష్మి పర్యటన..అభివృద్ధి పనుల పరిశీలన

### దమ్మూరులో ఫామ్‌పాండ్ పనుల పరిశీలన..
### అధికారులకు కీలక సూచనలు
### కూలీల హాజరు రోల్‌కాల్ తప్పనిసరిగా పాటించాలని ఆదేశం
### బూరుగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులతో ముచ్చట
### వెదురు సాగు, ఇంటిగ్రేటెడ్ ఫామ్‌పాండ్లపై అవగాహన

**ప్రజా వాయిస్, పలిమెల:**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో ఏసీఎల్‌బీ విజయ లక్ష్మి మేడం పర్యటించారు. ఈ సందర్భంగా దమ్మూరు గ్రామంలో కొనసాగుతున్న ఫామ్‌పాండ్ పనులను పరిశీలించి, పనుల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. కూలీల హాజరు విషయంలో రోల్‌కాల్ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని, కూలీలకు మెరుగైన వేతన రేటు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం బూరుగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించడంతో పాటు ఎస్ఏఎం (SAM) కేటగిరీకి చెందిన చిన్నారి బరువును స్వయంగా పరిశీలించారు. పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు.అనంతరం దమ్మూరు వీవో సమావేశంలో పాల్గొన్న ఏసీఎల్‌బీ.. మహిళా సంఘాల సభ్యులకు వెదురు సాగు, ఇంటిగ్రేటెడ్ ఫామ్‌పాండ్ల ప్రాధాన్యత, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఫామ్‌పాండ్లను సద్వినియోగం చేసుకుంటూ జీవనోపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.

# తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరుతో ఎన్ ఎస్ యు ఐ నాయకుల సంబరాలు..

**ప్రజా వాయిస్, చిగురుమామిడి (సెప్టెంబర్ 08):**
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినందుకు ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు పచ్చిమట్ల అజయ్ మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో బాణసంచా కాలుస్తూ స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్రమంతటా అధునాతమైన విద్య అందించేందుకు పేద పిల్లలకు భవిషత్తు కొరకై 1 వ, తరగతి నుండి 12 వ, తరగతి వరకు ఒకే దగ్గర విద్య అందించేలా నిర్వహిస్తున్న “ తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టి జి పి ఎస్)” బీసీ,రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో 9,62,00000 రూపాయల మంజూరు చేసి



చిగురుమామిడి మండల కేంద్రంలో స్థాపించబోతుండటంతో 17 గ్రామాల ప్రజలు, విద్యార్థులు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుస్నాబాద్ ఏ ఎం సి చైర్మన్ కంది తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందే సురేష్, గ్రామ సర్పంచ్ ఆకావరం భవాని శివప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ కుత్బొద్దిన్,డీసీసీ కార్యదర్శులు సంబారి బాబు,బదుకొలు దేవందర్ రెడ్డి, చిటుమళ్ళ రవీందర్, జిల్లా నాయకులు వంగర మల్లేశం , గోకురి మురారి రెడ్డి , షోశల్ మీడియా మండల కోఆర్డినేటర్ జిల్లెల్ల రమేష్ మండల సీనియర్ నాయకులు పుల లచ్చిరెడ్డి పోలు శ్రీనివాస్ , పచ్చిమట్ల జగన్ , ఒంటల రాజిరెడ్డి ,భగవాన్ ప్రసాద్, బొమ్మగాని వేంకటేశ్వర్ గౌడ్ , గ్రామ అధ్యక్షులు. వడియల సుధాకర్ రెడ్డి , కునా బాలయ్య వడియాల సంతోష్ రెడ్డి, శివంజనేయులు, గుడిసె అర్జున్ ,దంతనోజు కిషోర్ , కవ్వంపెల్లి సంజీవ్ సత్యనారయణ రెడ్డి ,దోమ తిరుపతి రెడ్డి,నరసింహా రెడ్డి, బలా కృష్ణచారి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు, విద్యార్దులు పాల్గోన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

### ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలి
### అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్



**ప్రజా వాయిస్.. వనపర్తి**
విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా”సతీష్ యాదవ్ అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జీ.విష్ణు (ఎస్.ఏ, వెలుగొండ), ఎస్.శివ (ఎస్.ఏ, సవాయిగూడెం)లను మంగళవారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత గురువుకే సమాజంలో అత్యున్నత స్థానం ఉందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు మరింత బాధ్యతతో పనిచేయాలనే స్ఫూర్తిని కలిగిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణ, విజేత రాములు, చంద్రశేఖర్, సుజిత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## డీజే రహిత గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి

### మిర్యాలగూడ డీఎస్పీ జి. రవి....

**ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్:**
హాలియా పట్టణంలోని గణేష్ మండపాల నిర్వాహకులతో మిర్యాలగూడ డీఎస్పీ జి. రవి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, డీజేలకు దూరంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ సూచించిన నిబంధనలు పాటిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ఉత్సవాలు, ఊరేగింపులు మరియు నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.ప్రతి ఒక్కరి స్వచ్ఛంద సహకారంతో డీజే రహితంగా, భక్తి శ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం.ఈ సమావేశంలో హాలియా సీఐ ఎస్. రాఘవ రావు, హాలియా ఎస్సై బి. సాయి ప్రశాంత్ మరియు గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## సొంత స్థలం లోని ప్రహరీ గోడ కూల్చివేత పై ఫిర్యాదు

### ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చి వేశారంటూ బాధితుడి ఆరోపణ
### గ్రామ సర్పంచ్,పంచాయతీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వినతి
### తనకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన బాధితుడు





**ప్రజా వాయిస్/కొడకండ్ల**
తన సొంత స్థలంలో నిర్మించుకున్న ప్రహరీ గోడను గ్రామ సర్పంచ్, పంచాయతీ సిబ్బంది ఎలాంటి ముందస్తు సమాచారం, ఇవ్వకుండా అధికారుల నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కూల్చివేశారని ఆరోపిస్తూ ఓ బాధితుడు తహసీల్దార్ కు మరియు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఫిర్యాదు ప్రకారం.. మండలంలోని కొడకండ్ల మండలం పరిధిలోని చెరువు ముందు తండా గ్రామానికి చెందిన బాధితుడు ధరావత్ చందులాల్ తన స్థలంలో ప్రహరీ గోడ నిర్మించుకున్నాడు. అయితే గ్రామ సర్పంచ్, తనకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా పంచాయతీ సిబ్బంది తో కలిసివచ్చి ఆ గోడను కూల్చివేశారని పేర్కొన్నారు. స్థలానికి సంబంధించిన రికార్డులు, పట్టా తదితర పత్రాలు తన వద్ద ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా గోడను తొలగించారని ఫిర్యాదులో ఆరోపించారు.తనకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, విచారణ చేపట్టకుండా నిర్మాణాన్ని కూల్చివేయడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు తనకు జరిగిన నష్టానికి న్యాయం చేయాలని అధికారులను కోరారు.అధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించి న్యాయం చేయాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.



# తుర్కపల్లిలో రాస్తారోకో.. కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు

**ప్రజా వాయిస్/తుర్కపల్లి,**

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా స్పీకర్‌ను అవమానించేలా దూషించడంతో పాటు, ఒక దళిత బిడ్డను అవమానపరిచారంటూ నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, మండల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించేది లేదని పేర్కొన్నారు. సంబంధిత ఘటనపై నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. రాస్తారోకో అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అక్కడి నుంచి కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి బయలుదేరారు. దీంతో తుర్కపల్లి మండల కేంద్రంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి పరిస్థితిని పర్యవేక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జాతీయ స్థాయి టీ-10 క్రికెట్ పోటీలకు సుక్క గిరిబాబు ఎంపిక

**ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన సుక్క గిరిబాబు జాతీయ స్థాయి టీ-10 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రస్తుతం గురుకుల పాఠశాలలో పి.టి వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఆయన, సెప్టెంబర్ 7న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టీ-10 క్రికెట్ ఎంపిక పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ అవకాశం దక్కించుకున్నారు. టీ-10 క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అక్టోబర్ 1 నుండి 4 వరకు పంజాబ్ రాష్ట్రంలోని బటాలాలో జరగనున్న '3వ సీనియర్ నేషనల్ టీ-10 క్రికెట్ ఛాంపియన్‌షిప్' పోటీల్లో గిరిబాబు తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా తన బాధ్యతలు నిర్వహిస్తూనే, క్రీడల్లో విశేష ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. గిరిబాబును పలువురు ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, గ్రామ పెద్దలు, స్నేహితులు అభినందిస్తూ, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# 15 ఏళ్ల సేవకు జిల్లా స్థాయి గుర్తింపు

**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్, సెప్టెంబర్ 08**

హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవ రాయినిగూడెం గ్రామానికి చెందిన మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్ కాటబోయిన వెంకటేశ్వర్లుకు జిల్లా స్థాయి ఉత్తమ సేవా అవార్డు లభించింది. గత 15 ఏళ్లుగా అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న కాటబోయిన వెంకటేశ్వర్లు సూర్యాపేట జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ ఘనంగా సన్మానించి అభినందించారు. 8వ వార్డు నుంచి 14వ వార్డు వరకు పారిశుధ్య సేవల్లో భాగంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డు దక్కడం అభినందనీయమని 14వ వార్డు కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావు అన్నారు. ప్రజారోగ్యం, పారిశుధ్య పరిరక్షణలో మున్సిపల్ సిబ్బంది సేవలు కీలకమని చైర్మన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డుతో ప్రోత్సహించిన జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్మన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మేరిగఅశోక్, కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొని వెంకటేశ్వర్లును అభినందించారు.




# ఓపెన్ చెస్ట్ సర్జరీ లేకుండానే అయోర్టా సమస్యకు చికిత్స

**గజ్జల్లో చిన్న కోతతో స్టెంట్- గ్రాఫ్ట్ అమరిక**

**వివరాలు వెల్లడించిన కార్డియాలజిస్ట్ డాక్టర్ రాకేష్ రెడ్డి**

**ప్రజా వాయిస్,కోదాడ:**

ఛాతీ భాగంలోని అయోర్టా (మహాధమని) సంక్లిష్ట సమస్యలతో బాధపడుతున్న బాధితులకు ఓపెన్-చెస్ట్ సర్జరీ అవసరం లేకుండానే సోమాజిగూడ యశోద హాస్పిటల్స్‌లో 'థొరాసిక్ ఎండోవాస్క్యులర్ అయోర్టిక్ రిపేర్ ద్వారా అధునాతన చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి అసోసియేట్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాకేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాధారణంగా ఓపెన్ అయోర్టిక్ సర్జరీలో ఎక్కువ ప్రమాదం ఉన్న బాధితులకు ఈ మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్స ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. గజ్జల్లోని రక్తనాళం ద్వారా క్యాథెటర్‌ను ప్రవేశపెట్టి, ప్రత్యేకమైన స్టెంట్ గ్రాఫ్ట్‌ను దెబ్బతిన్న అయోర్టా వద్దకు చేర్చి లోపల నుంచి సీల్ చేస్తారని తెలిపారు. థొరాసిక్ అయోర్టిక్ అన్యూరిజం, డిసెక్షన్, అల్సర్ వంటి తీవ్ర సమస్యలకు పూర్తి ఆరోగ్య పరీక్షలు, సిటీ యాంజియోగ్రఫీ వివరాలు ఆధారంగా ఈ చికిత్సను నిర్ణయిస్తామన్నారు. నిపుణులైన కార్డియాలజిస్టులు, సర్జన్లు, అనస్థీషియా బృందం సమన్వయంతో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ ఉమేష్ అసిస్టెంట్ మేనేజర్ రామ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.....

# సర్వేర్లను అరెస్టు చేయడం సమంజసం కాదు

**సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వెంకన్న**

**తొర్రూర్ ప్రజా వాయిస్**




మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలో లైసెన్స్ సర్వేయర్ల అసెంబ్లీ ముట్టడి సందర్భంగా లైసెన్స్ సర్వేయర్లను మంగళవారం తొర్రూర్ పోలీస్ స్టేషన్లో ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని మహబూబాబాద్ జిల్లా సర్వేయర్ ల సంఘం అధ్యక్షుడు బండారు వెంకన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లైసెన్సుడ్ సర్వేయర్లను పెట్టుకొని నామమాత్రపు జీతాలతో తన పనిని చేసుకోవాలని చూస్తుండడంతో సర్వేయర్ ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అసెంబ్లీ ముట్టడికి యూనియన్ పిలుపునివ్వడంతో పోలీసులు ముందస్తువులు అరెస్టు చేయడం సమంజసం కాదని సర్వేయర్ల డిమాండ్లను నెరవేర్చి భూభారతిలో మా యొక్క పని తీరును వినియోగించుకోవాలని మరియు మా యొక్క డిమాండ్స్ ను నెరవేర్చాలని ఆయన అన్నారు. రీ సర్వేలో పని వేతనం ఎకరానికి 60 చెల్లింపును రద్దుచేసి నేలకు 50 వేల గౌరవ వేతనం ఇవ్వాలని మరియు ఉద్యోగ ఆరోగ్య కుటుంబ భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కోశాధికారి గంధం జంపయ్య పాల్గొన్నారు..

# ఎమ్మెల్సీ తాతా మధుపై అక్రమ కేసులు ఎత్తివేయాలి!

**కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలి**

**ప్లకార్డులతో రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ శ్రేణులు.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు**

**ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు ఆపాలి: బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య**

**ప్రజా వాయిస్ ఖమ్మం:**

బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌పై ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని, మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ఎత్తున నిరసన చేపట్టారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వైఖరిని ఖండిస్తూ ప్లకార్డులు చేతబూని నాయకులు, కార్యకర్తలు ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ వైఖరికి, ఎమ్మెల్యే దిగజారుడు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా నేలకొండపల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై నిలదీస్తున్న ఎమ్మెల్సీ తాతా మధుపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరణించాలని కోరుకుంటున్నామంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని ఆయన తీరును తీవ్రంగా ఎండగట్టారు. ఒక ప్రజాప్రతినిధిగా ఉంటూ అహంకారంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా మాట్లాడిన ఎమ్మెల్యేపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. తక్షణమే తాతా మధుపై పెట్టిన అక్రమ



కేసులను ఉపసంహరించుకోవాలని, వీర్లపల్లి శంకర్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు ర్యాలీగా వెళ్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి శ్రీనివాసరావు, సర్పంచులు శీలం వెంకటలక్ష్మి, కోటి సైదారెడ్డి, బొడ్డు వసంత, పట్టన అధ్యక్షుడు గడ్డం లక్ష్మయ్య, నాయకులు హుస్సేన్, అనగాని నరసింహారావు, కొండా కనక ప్రసాద్, మాదాసు ఆదాం, యువ కార్యకర్తలు వినయ్, ఉదయ, మండల గ్రామ శాఖల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దళితులపై ఆగని బిఆర్ఎస్ అహంకార వైఖరి

**తాత మధుసూదన్ ను శాసన మండల నుంచి వెంటనే తొలగించాలి**

**మాల మహానాడు వనపర్తి జిల్లా అధ్యక్షులు మద్దిలేటి**

**ప్రజా వాయిస్.. వనపర్తి**



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి దళిత స్పీకర్ అయినటువంటి గడ్డం ప్రసాద్ కుమార్ ని అమ్మర్యాదపూర్వకంగా ఏకవచనంతో దుర్భాషలాడిన తాత మధుసూదన్ ను తక్షణమే శాసన మండలి నుండి తొలగించాలని మాల మహానాడు వనపర్తి జిల్లా అధ్యక్షులు మొలకలపల్లి మద్దిలేటి (మధు) తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ అధినేత అయినటువంటి కెసిఆర్ అసెంబ్లీ సమావేశాలకు రాకుండా సమావేశాలకు వస్తే ఒక దళితున్ని అధ్యక్ష అనవలసి వస్తుందని అందుకోసమే అసెంబ్లీకి రాకుండా ఉన్నాడని ఆయన అన్నారు. బిఆర్ఎస్ నాయకులకు సిగ్గు శరం లేదు తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి ముఖ్యమంత్రి దళితుని చేస్తానని అప్పుడు మోసం చేశారు పది సంవత్సరాలు అధికారంలో ఉన్నటువంటి దళితులపై జరుగుతున్నటువంటి దాడులను యావత్ ప్రపంచం కల్లారా చూస్తూ అన్ని గమనిస్తూ ఉన్నారు. ఎన్ని రోజులు బిఆర్ఎస్ నాయకులు ఆగడాలు తక్షణమే తాత మధుసూదన్ గడ్డం ప్రసాద్ కుమార్ కు క్షమాపణ చెప్పాలి మరియు శాసనమండలి నుండి తొలగించాలని లేదా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు(ధర్నాలు) చేస్తామని హెచ్చరించారు



# దామెర పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ

**ప్రజా వాయిస్ హన్మకొండ /దామెర**

దామెర పోలీస్ స్టేషన్‌ను వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ శంక్వర్ మంగళవారం దామెర పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. డీసీపీ తో పరకాల ఏసీపీ సతీష్ బాబు, పరకాల రూరల్ జ× సుధాకర్ రెడ్డి ఉన్నారు.




# ముత్తిరెడ్డిగూడెం పాఠశాలలో ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు

**టెన్త్ టాపర్లకు ఎన్నారై ప్రశాంత్ రెడ్డి ఆర్థిక ప్రోత్సాహం**

**చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచన**

**మోటకొండూర్, సెప్టెంబరు 8(ప్రజా వాయిస్):-**

మోటకొండూర్ మండలంలోని ముత్తిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎన్నారై దాత పీసరి ప్రశాంత్ రెడ్డి బుధవారం నగదు పురస్కారాలు అందజేసి సత్కరించారు. పాఠశాల స్థాయిలో 538/600 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన కుమారి దుంప సంధ్యకు రూ. 10,000, అలాగే 522/600 మార్కులతో ద్వితీయ స్థానం సాధించిన కుమారి అలకుంట్ల సింధుశ్రీకి రూ. 2,500 నగదు బహుమతులను అందజేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఏన్నారై ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం సబ్జెక్టు నాలెడ్జ్ కే పరిమితం కాకుండా, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ బుడిగె బాలరాజు మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు చలికాలంలో స్వెట్టర్లు, పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించిన ప్రశాంత్ రెడ్డి సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో దాత పీసరి ప్రశాంత్ రెడ్డి, సర్పంచ్ బాలరాజు, గ్రామస్తులు బీరప్ప, పన్నీరు భరత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్షర జ్ఞానంతోనే మహిళా సాధికారత

### 100 శాతం మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
### కోదాడలో 300 మంది మహిళలతో అవగాహన సదస్సు.. ర్యాలీ

**ప్రజా వాయిస్,కోదాడ:**
అక్షర జ్ఞానంతోనే మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించగలరని ఉమ్మడి నల్లగొండ జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కోదాడ పట్టణంలోని మండల స్వయం సహాయక సంఘాల కార్యాలయంలో మహిళలకు అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మహిళలకు అక్షరాస్యత ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం సుమారు 300 మంది మహిళలతో కోదాడ పట్టణంలో అవగాహన సదస్సు నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. మహిళలు చదువుకోవడం ద్వారా తమ హక్కులు, బాధ్యతలు, ప్రభుత్వ పథకాలు, ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకోవచ్చని అధికారులు వివరించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. మహిళలు అక్షరాస్యులైతే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. చదువు కేవలం ఉద్యోగం కోసమే కాకుండా.. రోజువారీ జీవితంలో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంచుతుందని తెలిపారు. మహిళల్లో అక్షరాస్యత శాతం పెంచేందుకు వయోజన విద్యా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి మహిళ అక్షరాస్యురాలిగా మారేలా కృషి చేయడం, 100 శాతం మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలను చైతన్యపరిచి, అక్షరాస్యత కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని



సూచించారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వయోజన విద్య అడిషనల్ పీడీ సురేష్, ఏపీఎం వెంకన్న, సీసీ రామకృష్ణ, చిన్ని, కోదాడ, అనంతగిరి మండల అధ్యక్షులు నాగలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలపై డ్రామాలు కట్టిపెట్టాలి
# కోరుకంటి చందర్, పుట్ట మధూకర్

### -అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి బీఆర్ఎస్ వినూత్న నిరసన
### -కాంగ్రెస్ హామీలు గాలికి.. పెద్దపల్లిలో బీఆర్ఎస్ నాయకుల ధర్నా

**ప్రజా వాయిస్ పెద్దపల్లి**
ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే (ఇంచార్జ్) కోరుకంటి చందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలనను నిరసిస్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ... ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన మహిళా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలపై పోలీసులు ప్రవర్తించిన తీరు సిగ్గుచేటని ఖండించారు. కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థులకు రూ. 5 లక్షల ఏటీఎం కార్డులు, యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించారని మండిపడ్డారు. మంథని ఎమ్మెల్యే, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలకు కొత్త పరిశ్రమలు తీసుకురావడంలో, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పెద్దపల్లి పట్టణ మధ్యలో బస్సు డిపో నిర్మిస్తే శబ్ద, ట్రాఫిక్ కాలుష్య సమస్యలు వస్తాయని, దానిని పట్టణం బయట ఏర్పాటు చేసి బస్టాండ్ సమీప ప్రాంతాన్ని ఆస్పత్రులు లేదా కోర్టు భవనాల కోసం ఉపయోగించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కళ్యాణలక్ష్మి, పెన్షన్ల పెంపు, రోడ్ల నిర్మాణం, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లిలో ఇళ్ల నిర్మాణం మరియు కలెక్టరేట్ భవనం వంటి ఎన్నో అభివృద్ధి సంక్షేమ



కార్యక్రమాలు జరిగాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా బెదిరేది లేదని, ప్రజలు, మహిళల తరఫున బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, భూపాలపల్లి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి

### మూడు రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి
### రైతులు అవసరమైన పత్రాలు, భూమి హద్దులు చూపించి సహకరించాలి
### భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ వెల్లడి

**ప్రజా వాయిస్ పాల్వంచ**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల రూరల్ పరిధిలోని బోజ్యా తండా పరిధిలో చేపడుతున్న భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బోజ్యా తండా పరిధిలోని సర్వే నంబర్ 77లో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీ-సర్వేలో భాగంగా సర్వే అధికారులు రోవర్ పరికరాల సహాయంతో భూములను కొలుస్తున్న విధానాన్ని, క్షేత్రస్థాయిలో భూముల హద్దులను గుర్తిస్తున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న సర్వే ద్వారా భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, స్థానాన్ని ఖచ్చితంగా గుర్తించి, సంబంధిత భూ రికార్డులతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బోజ్యా తండా పరిధిలో మొత్తం 458 ఎకరాల్లో భూముల రీ-సర్వే చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం సర్వే నంబర్ 77లో 88 ఎకరాల్లో రీ-సర్వే పనులు కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు చేపట్టిన సర్వే పురోగతి, మిగిలిన భూముల్లో చేపట్టాల్సిన పనులు, సర్వేకు అవసరమైన సిబ్బంది, పరికరాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో భూరీ-సర్వే పనులను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే సమయంలో భూ యజమానుల నుంచి అవసరమైన వివరాలు, రికార్డులు, పత్రాలు సేకరించి, భూమి హద్దులను స్పష్టంగా గుర్తించాలని తెలిపారు. తద్వారా భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి రీ-సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల భూపత్రాలను పరిశీలించారు. తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర అందుబాటులో ఉన్న భూ రికార్డులను సర్వే అధికారులకు అందజేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో తమ భూముల వాస్తవ హద్దులను చూపించి సర్వే ప్రక్రియకు సహకరించాలని రైతులకు సూచించారు. భూముల రీ-



సర్వే పూర్తయిన అనంతరం భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలు మరింత స్పష్టంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధార ప్రసాద్, సర్వేయర్లు వెంకన్న, కళ్యాణ్, లైసెన్స్ సర్వేయర్లు మధు, వంశీ, కవిత, జీపీఓ రాధా, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధు ను బర్తరఫ్ చేయాలి

### ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కీసరలో కాంగ్రెస్ నాయకుల నిరసన
### ఎమ్మెల్సీ మధు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలన్న మేడ్చల్ జిల్లా మాల సంఘం అధ్యక్షులు గుజ్జుక పరశురాం డిమాండ్

**ప్రజావాయిస్, కీసర :**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కీసర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు తాత మధు వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ భారత రాజ్యాంగానికి లోబడి విధులు నిర్వహిస్తున్న అలాంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని కించపరిచేలా ఉందని మండిపడ్డారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు ఎమ్మెల్సీ తాత మధు వెంటనే క్షమాపణలు చెప్పాలని, ఆయనను శాసన మండలి నుంచి సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులపై మాట్లాడేటప్పుడు హుందాతనం, బాధ్యతాయుతమైన భాష పాటించాల్సిన అవసరం ఉందని అన్నారు. మేడ్చల్ జిల్లా మాల మహానాడు సంఘం అధ్యక్షులు గుజ్జుక పరశురాం నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ... బిఆర్ ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలని ఖండించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొట్టమొదటి సీఎం దళితుడే అని ప్రకటించిన కేసీఆర్ దళితులను మోసం చేశాడని, బిఆర్ ఎస్ ప్రభుత్వం లో దళితులకు 3 ఎకరాలు ఇస్తామని మోసం చేసిన చరిత్ర బిఆర్ ఎస్ ప్రభుత్వానిదే అని అన్నారు. బేషరతు గా ఎమ్మెల్సీ తాత మధు ఆయనను ప్రోత్సహించిన మాజీ సీఎం కేసీఆర్ దళితులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో ధోరల గడిలను బద్దలు కొట్టిన చరిత్ర దళితులదే అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం దళిత నాయకుడిని శాసన సభాపతి గా గౌరవిస్తే బిఆర్ఎస్ నాయకులు ఆ గౌరవాన్ని కించపరుస్తూ అవమనపరుస్తున్నారని అన్నారు. రాజకీయాలలో పదవులు శాశ్వతం కాదని, మంచి మర్యాద లే మెలన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే రాబోయే రోజుల్లో దళిత, బహుజనులు మొత్తం ఏకమయ్యి బిఆర్ఎస్ నాయకులను రాజకీయ సమాధి చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామిడి విజయ్‌రెడ్డి, తటకం వెంకటేష్ శర్మ, శివలింగాల శ్రీనివాస్ గౌడ్, మాల మహానాడు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పరశురాంతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# భద్రాద్రి జిల్లా టూరిజం నోడల్ అధికారిణిగా అనూష

### ఉత్తర్వులు విడుదల చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

**ప్రజా వాయిస్ భద్రాద్రి జిల్లా**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూరిజం నోడల్ అధికారిణిగా జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న గ్రూప్ - 1, అధికారిణి అనూషకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ సెక్రటరీ నిర్వహించిన సమావేశంలో పర్యాటక రంగం అభివృద్ధి చేయాలనే సంకల్పంతో భద్రాద్రి జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి కోసం అనుష ను నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించి, ప్రణాళికలు రూపొందించి, వాటి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందిస్తూ పర్యాటక అభివృద్ధికి నోడల్ అధికారి పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం పర్యాటక అధికారిగా ఉన్న పరాధామ రెడ్డి జిల్లా యువజన, క్రీడల. అధికారిగా కొనసాగనున్నారు.





# గోదావరిఖనిలో హోరెత్తిన గులాబీ నిరసన

### - సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్
### - మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**ప్రజా వాయిస్ గోదావరిఖని,**
శాసనసభ సాక్షిగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై కాంగ్రెస్ ప్రభుత్వం అవమానకరంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డాయి. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నాయకత్వంలో గోదావరిఖని మున్సిపల్ కార్పొరేషన్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ రాస్తారోకో నిర్వహించారు. ?ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా ప్రజాప్రతినిధులకు ఇస్తున్న గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. సీనియర్ నాయకురాళ్లు, మాజీ మంత్రుల పట్ల అసెంబ్లీలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు అహంకారపూరితంగా ఉందన్నారు. కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని పిలుపునిచ్చారు. ?ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కౌశిక హరి, వ్యాళ్ల హరీష్ రెడ్డి, మూల విజయ్ రెడ్డి, కరక పద్మజ శ్రీనివాస్, పోగుల వకుళ, సత్యవతి, మేకల సమ్మయ్య యాదవ్, మురళీధర్ రావు, తోకల రమేష్, తాళ్ల రాజయ్య, ఆముల నారాయణ, కార్పొరేటర్ నిమ్మరాజుల రవిలతో పాటు మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళా నాయకురాళ్లు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# రామప్ప దేవాలయంలో పునరుద్ధరణ పనుల పరిశీలన

### పునరుద్ధరించిన సోమసూత్రాన్ని పరిశీలించిన దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రామాల సునీత

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా; వెంకటాపూర్ మండలం:/**
వెంకటాపూర్ మండలం పాలంపేటలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రామాల సునీత మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరిశ్ శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన రామాల సునీత, రెండు రోజుల క్రితం పునరుద్ధరించిన సోమసూత్రాన్ని పరిశీలించారు. ఆలయానికి సంబంధించిన పునరుద్ధరణ పనులు, నిర్వహణకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన రామప్ప దేవాలయ పరిరక్షణకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్, పర్యాటక మార్గదర్శకుడు వెంకటేష్, పర్యాటక పోలీసులు, దేవాదాయ, పురావస్తు, పర్యాటక శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



# పేద ప్రజలకు అండగా సీఎం సహాయ నిధి

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన కొమ్మూరి

**ప్రజా వాయిస్/జనగామ జిల్లా బ్యూరో**
మంగళవారం జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జనగామ ఇంచార్జి,మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో జనగామ పట్టణంలో ఉన్న పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ.. జనగామ నియోజకవర్గ ప్రజలకు ఆపదలో ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రత్యేక చొరవ తీసుకొని జనగామ పట్టణం లో ఉన్న

జీ.నర్సయ్య :22500
బడికె రేవతీ:52500
నంద్యాల సత్యనారాయణ:82500
కోలా శ్రీలత:60000
తెరల లక్ష్మి:32500

**బచ్చన్నపేట మండలం నుండి**
ఇ .వెంకయ్య :60000
టీ. శిరీష:42500
జీ. రేణుకా:50000
మొత్తం:4025000

వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేయడం జరిగింది. అదేవిధంగా ముఖ్యమంత్రి నిధి కింద పేద ప్రజలకు మరియు ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అని కొమ్మూరి అన్నారు. ఈ కార్యక్రమం లో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుగు బాలరాజు గౌడ్, బచ్చన్నపేట మండల కాంగ్రెస్



పార్టీ అధ్యక్షులు ఎండి మసూద్, బచ్చన్నపేట సర్పంచ్ అల్వాల నర్సింగరావు,రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బొట్ల శ్రీనివాస్ , ఎస్సీ సెల్ కార్యదర్శి కళ్యాణం చంద్రమౌళి,సీనియర్ నాయకులు బడికే కృష్ణ స్వామి,చలపతి రెడ్డి, బృంగి సురేందర్ , ఆరేళ్ల విజయ్,నరేష్, రఘు గౌడ్, విక్రమ్ మరియు వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు .



# ఇప్పపువ్వు లడ్డూలకు ప్రశంసలు

## సంప్రదాయ ఆహారానికి ప్రోత్సాహం..

### మహిళా స్వయం ఉపాధికి మార్గం

**ప్రజా వాయిస్ కౌటాల**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని బోధంపల్లి గ్రామానికి చెందిన గోమాసి రాజేశ్వరి తయారు చేసిన సంప్రదాయ ఇప్పపువ్వు లడ్డూలు గురుద్‌పేట్ గ్రామంలో నిర్వహించిన ఎక్స్‌పోజర్ విజిట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎక్స్‌పోజర్ విజిట్‌కు విచ్చేసిన సర్పంచ్‌తో పాటు రైతు సోదరులకు రాజేశ్వరి లడ్డూలను రుచి చూపించగా, వాటి రుచి, నాణ్యతపై వారు ప్రశంసలు కురిపించారు. ఇప్పపువ్వు ఆదివాసీ సమాజంలో తరతరాలుగా ఉపయోగిస్తున్న సంప్రదాయ ఆహార పదార్థాల్లో ఒకటి. ఇప్పపువ్వుతో తయారు చేసే లడ్డూలలో బెల్లం, పల్లీలు, నువ్వులు, డ్రైఫ్రూట్స్ వంటి పదార్థాలను ఉపయోగించే పద్ధతులు ఉన్నాయి. ఈ ఆహారాన్ని ఆధునిక రూపంలో పరిచయం చేయడం ద్వారా సంప్రదాయ ఆహార సంస్కృతిని కాపాడటంతో పాటు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయి. బోధంపల్లి గ్రామంలో రాజేశ్వరి చేపట్టిన ఈ వినూత్న ప్రయత్నం స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తులకు విలువ జోడించడంతో పాటు, సంప్రదాయ ఆహారాన్ని ప్రోత్సహించడానికి మంచి ఉదాహరణగా నిలుస్తోంది. ఇప్పపువ్వు లడ్డూలను తయారు చేసి పరిచయం చేసిన గోమాసి రాజేశ్వరి కార్యక్రమంలో పాల్గొన్న వారు అభినందనలు తెలిపారు. ఇలాంటి స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహిస్తే గ్రామీణ మహిళలకు అదనపు ఆదాయ మార్గాలు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# గణేష్ నిమజ్జన కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ నితికా పంత్

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గణపతి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు జిల్లా పోలీస్ శాఖ ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆసిఫాబాద్ పెద్దవాగు, కాగజ్‌నగర్ పెద్దవాగు నిమజ్జన కేంద్రాలను సందర్శించి, గణేష్ మండపాల నుంచి నిమజ్జన కేంద్రాల వరకు ఉన్న ఊరేగింపు మార్గాలను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, బారికేడింగ్ అంశాలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడింగ్, రోప్ బ్యారియర్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని, వాహనాలకు ప్రత్యేక రూట్ మ్యాప్, పార్కింగ్ స్థలాలు కేటాయించాలని ఆదేశించారు. భారీగా జనం గుమిగూడే చోట్ల క్రౌడ్ మేనేజ్‌మెంట్, నిరంతర పోలీస్ పర్యవేక్షణతో పాటు సిసిటివి, డ్రోన్ నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి వనరుల వద్ద ప్రమాదకర ప్రాంతాలకు బారికేడింగ్, నిమజ్జనానికి ఉపయోగించే క్రేన్లు, యంత్రాల భద్రతపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్య, అగ్నిమాపక, రక్షణ బృందాలతో సమన్వయం చేసుకోవాలని, అత్యవసర పరిస్థితుల కోసం క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పిల్లలు లేదా కుటుంబ సభ్యులు తప్పిపోతే వెంటనే సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ



ఆదేశించారు. ప్రజలు పోలీస్ సూచనలు పాటిస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండి, పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.



# జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటిన దోమకొండ విద్యార్థులు

**ప్రజా వాయిస్ దోమకొండ సెప్టెంబర్ 7**
కర్నూల్ జిల్లాలో లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఒకినవా గోజు ర్యు కరాటే అకాడమి కి చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కరాటే పోటీల్లో దోమకొండ విద్యార్థులు అత్యున్నత పోటీ కనబరిచి 16 గోల్డ్ మెడల్స్ 10 సిల్వర్ మెడల్స్ 4 బ్రాంజ్ మెడల్స్ గెలుచుకున్నారు. దోమకొండ గ్రామానికి చెందిన 11 మంది విద్యార్థులు నిత్య, ధన శ్రీ , శ్రీనిక్త, విశాల్, నివాస్, నవదీప్, శ్యామ్, లోహిత్, లిఖిత్, ఉమేష్ గౌడ్,లు బంగారు పథకం సాధించగా కీర్తన విద్యార్థిని సిల్వర్ మెడల్ సాధించారు. ఈ కాంపిటీషన్ లో మాస్టర్ లు కమిండ్ల నవీన్ , గునోళ్ల కుమార్, సంతోష్, లక్ష్మీనర్సు , కోచ్ సుభాష్ పాల్గొన్నారు.

# భూకబ్జా దారులపై ఫరీద్‌పేట్ రైతులు పిర్యాదు

**ప్రజా వాయిస్ దోమకొండ సెప్టెంబర్ 8**
కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్‌పేట్ గ్రామంలో ప్రజాప్రతినిధి ముసుగులో సాగుతున్న అరాచకాలు, అక్రమాలు ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయి. గ్రామానికి చెందిన బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తు సోమవారం నాడు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట మీడియా ముందు తమ గోడు వెళ్లబోసుకున్న రైతులు, ఆ సదరు వ్యక్తి నిరంకుశ పోకడలపై తీవ్రమైన ఆరోపణలు గుప్పించారు. సర్వే నంబర్ 885లో రైతు పల్లె స్వామి గౌడ్ ఎంతో కష్టపడి కొనుగోలు చేసుకున్న పట్టా భూమికి, ఆన్‌లైన్ రికార్డులు నమోదు చేయకుండా రైతు బందు రాకుండా కుట్ర పన్నారని బాధితులు దీనివల్ల సదరు రైతుకు రావాల్సిన పాస్‌బుక్, రైతుబంధు పథకం అందని ద్రాక్షలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో సర్వే నంబర్ 884లో తనకు గ్రామంలో అత్యంత సన్నిహితులు,అనుకూలంగా ఉన్న ఇద్దరు వ్యక్తులకు అక్రమంగా పట్టా పాస్‌బుక్‌లు ఇప్పించి వారికి మాత్రం ప్రభుత్వ సాయం అందేలా చేయడం పట్ల రైతులు మండిపడ్డారు. కేవలం సాధారణ భూములనే కాకుండా సర్వే నంబర్ 888లోని ఎస్సీ రిజర్వేషన్ భూమిని సైతం అక్రమంగా పట్టా చేసుకున్నాడని బాధిత రైతులు బహిరంగంగానే నిలదీశారు. తమకు జరిగిన మోసంపై నిలదీస్తే మాటలతో కాలక్షేపం చేస్తున్నారని పల్లె స్వామి గౌడ్, గుంటి మైసయ్య తదితరులు వాపోయారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన స్వయంగా భూ కబ్జాలకు, అక్రమాలకు పాల్పడుతుండటంతో ఫరీద్‌పేట్ రైతాంగం తీవ్ర భయాందోళనలో ఉంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి,



అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలనిబాధితులకు తక్షణమే న్యాయం చేసి పాస్‌బుక్‌లు, రైతుబంధు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ అధికారులు స్పందించకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణపై రైతులకు అవగాహన

**ప్రజా వాయిస్ /రఘునాథపల్లి, సెప్టెంబర్ 8:**
రఘునాథపల్లి మండలం, జనగామ జిల్లా కంచనపల్లి గ్రామంలోని రైతు వేదికలో మారి ( MARI--BCI LDC) ఆధ్వర్యంలో పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణ మరియు నియంత్రణ చర్యలపై రైతుల అవగాహన సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి మండల వ్యవసాయ అధికారి (ూూ) కర్ణాకర్ రెడ్డి , టి ఆర్ వి కే రమ్య , మంతపురం యాదగిరి వ్యవసాయ విస్తరణ మండలి సలహాదారులు మారి బీసీఐ ప్రొడ్యూసర్ యూనిట్ మేనేజర్ ( MARI--BCI Producer Unit Manager) చక్రపు వెంకటేశ్వర్లు, MARI--BCI సంస్థ సిబ్బంది, బానాజీపేట సర్పంచ్ జి. శ్రీనివాస్, రామన్నగూడెం సర్పంచ్ లావణ్య తదితరులు హాజరయ్యారు. మండలంలోని పలువురు బీసీఐ ( BCI )రైతులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మరియు దీజ× సిబ్బంది పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతి తగ్గించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు



జాగ్రత్తలు, నివారణ మరియు నియంత్రణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే బి సి ఐ సిద్ధాంతాలు, ప్రమాణాలు, పురుగుమందుల (Pesticides) సురక్షిత వినియోగ పద్ధతులు, పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో కనీస రక్షణ దుస్తులు (ూాజు) ధరించడం వంటి అంశాలపై రైతులకు వివరించారు. ఎం ఏ ఆర్ ఐ (దీజ×)హీూ=×--దీజ× సంస్థ రైతుల అభివృద్ధి కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై కూడా సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా ఫామ్ పాండ్ల నిర్మాణం, బి ఆర్ సి సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలు, కషాయాల తయారీ మరియు వినియోగం, అగ్రో ఫారెస్ట్రీ (Agro-Forestry) వంటి స్థిరమైన వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. రైతులు గులాబీ రంగు పురుగును ప్రారంభ దశలోనే గుర్తించి, శాస్త్రీయ మరియు సురక్షిత పద్ధతుల్లో నియంత్రణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచించారు. పంటలో పురుగుల ఉధృతి తగ్గించడంతో పాటు, రైతుల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సమావేశం ద్వారా పత్తి రైతులకు గులాబీ రంగు పురుగు నివారణ, బి.సి.ఐ ప్రమాణాలు మరియు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై ఉపయోగకరమైన అవగాహన లభించింది. రైతులు అన్నారు.



# పరిశుభ్రమైన వాతావరణంలోనే మెరుగైన వైద్యం

## రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కొమ్ము కృష్ణ

## నందిగామ ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య కార్యక్రమం

**(ప్రజా వాయిస్ షాద్ నగర్)**
నందిగామ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో రోగుల సౌకర్యార్థం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కొమ్ము కృష్ణ హాజరై శ్రమదానం చేశారు ఈ సందర్భంగా స్థానిక మాట్లాడుతూ. మన ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గ్రామీణ ప్రాంత పేద రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. డిప్యూటీ డిఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి సూచనలు, ఆదేశాల మేరకు ఆసుపత్రిలో ప్రత్యేక క్లీనింగ్ వర్క్ చేపట్టడం అభినందనీయం అని తెలిపారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వైద్యాధికారులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బొమ్మగాళ్ల నరసింహ, కుమారి సూరి, రమేష్, స్థానిక నాయకులు జగ్గారి జగ్గయ్య, నాయకపు జగ్గయ్య, అగ్గి కృష్ణ, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# ఆశా కార్యకర్తల అక్రమ అరెస్టులు అమానుషం

## సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్

**ప్రజా వాయిస్ కామారెడ్డి/**
పోలీస్ స్టేషన్ లో జరిగిన ఆశ వర్కర్ల సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఇందిరా పార్కు ధర్నాకు బయలుదేరిన ఆశా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని అన్నారు, ఆశా వర్కర్లకు 18000 ఫిక్స్ వేతనం నిర్ణయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరు నెలల పిఆర్సి ఏరియర్స్ లేప్రసి సర్వే, పల్స్ పోలియో ,ఎలక్షన్ డ్యూటీ తదితర పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి, ఎన్ సి డి ఆన్లైన్ చేయించకూడదు, స్కూటం డబ్బాలు మోపించకూడదని, ఏఎన్ సీ పి ఏం సి తదితర టార్గెట్స్ ను రద్దు చేయాలి, ఆదివారం పండుగలకు సెలవులు, సంవత్సరానికి 20 క్యాజువల్ సెలవులు, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు నిర్ణయించాలని, ఏఎన్ఎం జీఎన్ ఏం పోస్టులలో ఆశలకు ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలి, డిమాండ్స్ అన్నిటిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సెప్టెంబర్ 8న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనడానికి కామారెడ్డి జిల్లాలోని ఆశా కార్యకర్తలు బయలుదేరుతుంటే అక్రమంగా ఇండల్లోకి వెళ్లి రాత్రి అర్ధరాత్రి



రెండు మూడు గంటల సమయంలో గర్జనంగా తీసుకురావడం పొజిషన్లో పెట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు ఆశా కార్యకర్తలు జ్యోతి, కల్పన, మంజుల,శిరీష,లావణ్య, మంజుల రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట, నిజాంబాద్ జిల్లా కమ్మర్పల్లి ఆశాలతో పాటు జిల్లావ్యాప్తంగా మొత్తం 400 మంది ఆశా కార్యకర్తలు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.



# రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న కాంగ్రెస్ సర్కార్

**-కేసీఆర్ ను విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ నేతలకు లేదు**

**-ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**-బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి**

ప్రజా వాయిస్/అడ్డగూడూరు :
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ నిరంకుశ పాలనను సాగిస్తుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఆవరణలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ మహిళా నేతల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య వ్యతిరేకమని, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ అరాచక పాలనను సాగిస్తుందని అన్నారు. తెలంగాణ జాతిపిత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ నేతలకు లేదని అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తుందని, కాంగ్రెస్ అసమర్థ పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షులు దేవగిరి బీఆర్ఎస్ నాయకులు జనార్ధన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఆనంద్ చారి, సైదులు, పురుషోత్తం రెడ్డి, రవి, శ్రీను, కిరణ్, వీరస్వామి, లోకేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఉస్మానియా 85వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకున్న కండ్లకుంట తండా బిడ్డ డా. లావుడ్యా నాదం

ప్రజా వాయిస్/బొమ్మలరామారం:
యాదాద్రి-భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం కండ్లకుంట తండాకు చెందిన లావుడ్యా నాదం ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవంలో ప్రతిష్టాత్మక పీహెచ్‌డీ (డాక్టరేట్) పట్టాను అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సెప్టెంబర్ 8న ఘనంగా నిర్వహించిన 85వ కాన్వకేషన్‌లో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా డా. లావుడ్యా నాదం డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. మారుమూల గిరిజన తండా నుంచి ఉన్నత విద్యను అభ్యసించి, ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సాధించడం పట్ల కండ్లకుంట తండా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన సాధించిన ఈ విజయం తండా యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. విద్యపై పట్టుదలతో కృషి చేస్తే మారుమూల ప్రాంతాల నుంచి కూడా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని డా. లావుడ్యా నాదం నిరూపించారని గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, మిత్రులు, కండ్లకుంట తండా గ్రామస్తులు, డా. లావుడ్యా నాదంకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

## అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకుల వినతిపత్రం

ప్రజా వాయిస్, హుజూర్‌నగర్, సెప్టెంబర్ 08
హుజూర్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆదేశాలతో హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హుజూర్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, రైతులు, మహిళలు, కార్మికులు, నిరుద్యోగులు, విద్యార్థులు, వృద్ధులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని అంబేద్కర్‌ను కోరుతూ వినతిపత్రం అందజేశారు.

# మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంపై దాడి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం

**-బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బాబు మహజన్**



**ప్రజా వాయిస్/ అడ్డగూడూరు:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం పై దాడి ప్రజాస్వామ్యం విలువలకు విరుద్ధమని బీఆర్ఎస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ నాయకులు బాలెంల బాబు మహజన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంపై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడి తీవ్రంగా ఖండించాల్సిన ఘటనని, ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు ఉండడం సహజమే కానీ వ్యక్తిగత ప్రదేశంలోకి వెళ్లి దాడికి పాల్పడడం ఆందోళనలు చేయడం ఏమాత్రం సబబు కాదని అన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడడం కాంగ్రెస్ నాయకుల అసహనానికి నిదర్శనమని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన నాయకులు కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లి ఉద్రిక్త పరిస్థితులు సృష్టించడం ప్రజాస్వామ్య సంస్కృతికి మంచిది కాదని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులే రాజకీయ పార్టీ నాయకులకు సహకరించారనే ఆరోపణలు నిజమైతే అది అత్యంత తీవ్రమైన అంశం అని ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని కాపాడాల్సిన వ్యవస్థ ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించకూడదని అధికారంలో ఉన్న వారైనా ప్రతి పక్షంలో ఉన్న వారైనా చట్టం ముందు అందరినీ సమానంగా గుర్తించాలన్నారు. రాజకీయ కక్ష సాధింపులకు పోలీస్ వ్యవస్థను ఉపయోగించకూడదని వ్యవసాయ క్షేత్రం పై జరిగిన దాడి కేవలం వ్యక్తిపై జరిగిన చర్యగా కాకుండా ప్రజాస్వామ్యం వ్యవస్థపై జరిగిన దాడిగా ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. రాజకీయ ప్రత్యర్థులను విమర్శించడానికి ప్రజాస్వామ్యంలో అనేక మార్గాలు ఉన్నాయని బెదిరింపులు దాడులు వాటిలో భాగం కావని ఆయన పేర్కొన్నారు.

# న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ సాధించిన ప్రొఫెసర్ ప్రేం చెపూరి

**-మారుమూల అడవిలో పుట్టి.. పీహెచ్డీ పట్టా కొట్టే..**

**-ప్రేమ్ చేపూరి విజయగాధ**

ప్రజా వాయిస్/దేవరకొండ
నల్గొండ జిల్లా, దేవరకొండ నియోజకవర్గం, చందంపేట మండలం, పెద్దముల గ్రామ నివాసి ప్రేమ్ చెపూరి చదువులో విజయగాధ. జిల్లాలో మారుమూల మండలంలోని అడవిలో ఉండే క్రూగ్రామం. చీమలు కూడా దూరని చిట్టడవి..కాకులు కూడా దూరని కారడవి..అటువంటి మారుమూల ప్రాంతంలో జన్మించి, ఎన్నో కష్టాలను అధిగమించి, న్యాయశాస్త్రంలో డాక్టరేట్ సాధించడం సాధారణ విషయం కాదు. ఇది ఒక వ్యక్తి విజయం మాత్రమే కాదు-ఒక కుటుంబం, ఒక గ్రామం, ఒక ప్రాంతం గర్వించదగ్గ చారిత్రాత్మక ఘట్టం. పెద్దముల గ్రామం వంటి మారుమూల ప్రాంతాల్లో జీవితం ఎంతో సవాళ్లతో కూడుకున్నది. రాత్రి 6 గంటల తర్వాత వాహన సౌకర్యాలు లేకపోవడం, అడవి ప్రాంతం కావడంతో రాత్రివేళ బయటకు వెళ్లడం కష్టంగా ఉండటం, అడవి జంతువుల భయం, విద్యా వనరులు మరియు రవాణా సౌకర్యాల కొరత.. ఇలాంటి పరిస్థితుల్లో పెరిగిన ఒక వ్యక్తి ఉన్నత విద్యను అభ్యసించి, న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ సాధించడం నిజంగా అసాధారణమైన పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. రైతు కుటుంబం నుంచి వచ్చిన ప్రేం చెపూరి, పేదరికం లేదా గ్రామీణ నేపథ్యం తన కలలకు అడ్డంకి కాదని నిరూపించారు. సౌకర్యాలు తక్కువగా ఉన్నా, సంకల్పం బలంగా ఉంటే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించవచ్చని తన ప్రయాణం ద్వారా చూపించారు. ఒకప్పుడు మారుమూల గ్రామంలో చదువుకోవడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న వ్యక్తి.. ఈ రోజు విశ్వవిద్యాలయ వేదికపై న్యాయశాస్త్రంలో డాక్టరేట్ పట్టా అందుకోవడం చూస్తుంటే, ఆయన కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తల్లిదండ్రుల కష్టాలు, కుటుంబం అందించిన ప్రోత్సాహం, తన నిరంతర శ్రమ-ఇవన్నీ కలిసే ఈ విజయాన్ని సాధ్యమయ్యేలా చేశాయి అని ఆయన అన్నారు. ఇది కేవలం ఒక సర్టిఫికేట్ కాదు..ఇది ఎన్నో సంవత్సరాల కష్టానికి ప్రతిఫలం..ఇది ఎన్నో నిద్రలేని

**రాత్రులకు గుర్తింపు..**

**ఇది ఒక రైతు కుటుంబం కన్న కలలకు సాకారం..**

ఇది ఒక మారుమూల గ్రామం నుంచి వెలుగులోకి వచ్చిన విద్యా విజయగాథ అని తెలిపారు. పుట్టిన ప్రదేశం మన భవిష్యత్తును నిర్ణయించదు..మన పట్టుదలే మన గమ్యాన్ని నిర్ణయిస్తుంది అనే మాటకు ప్రేం చెపూరి జీవితం ఒక




గొప్ప ఉదాహరణ అని చెప్పుకోవచ్చు. ఆయన సాధించిన పిహెచ్డి ఇన్ లా కేవలం ఆయన కుటుంబానికే కాదు, పెద్దముల గ్రామానికి, దేవరకొండ నియోజకవర్గానికి, చందంపేట మండలానికి, నల్గొండ జిల్లాకు గర్వకారణం అని చెప్పొచ్చు. మారుమూల అడవిలో పుట్టి, విద్యా ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించిన ప్రేం చెపూరికి పలువురు అభినందనలు తెలియజేశారు. మీ విజయం మరెన్నో గ్రామీణ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలి. మీ జ్ఞానం సమాజానికి ఉపయోగపడాలి. మీ భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలని గ్రామస్తులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

# రాజ్యాంగ వ్యవస్థలను అవమానిస్తే సహించేది లేదు

**స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు దిష్టిబొమ్మ దహనం**

**షాబాద్ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదు**

(ప్రజా వాయిస్ షాబాద్)
తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిపై బీఆర్ఎస్ నాయకుడు తాతా మధు చేసిన అనుచిత అహంకారపూరిత వ్యాఖ్యలను షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించి తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి తమ తీవ్ర నిరసనను తెలిపారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన అత్యున్నతమైన స్పీకర్ స్థానం తెలంగాణ ప్రజాస్వామ్యానికి ప్రతీక అని, అలాంటి పదవిలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం బీఆర్ఎస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోల్పోయిన అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని స్పీకర్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు ధర్నా దిష్టిబొమ్మ దహనం అనంతరం షాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కాంగ్రెస్ నాయకులు, శాసనసభ స్పీకర్‌ను అవమానించిన తాతా మధుపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సైకి రాతపూర్వక ఫిర్యాదు సమర్పించారు ఈ నిరసన కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రటరీ భార్గవ్ రామ్, సెక్రటరీ యాదయ్య, షాబాద్ సర్పంచ్ అశోక్, పోతుగల్ సర్పంచ్ పామెన నరసింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, కిసాన్ సెల్ వెంకట్ రెడ్డి, సర్దార్




నగర్ మార్కెట్ డైరెక్టర్ నర్సింలు, సీనియర్ నాయకులు లింగేష్, ఆనంద్, యువ నాయకులు రవీందర్ రెడ్డి, వెంకటయ్య, సుభాష్, నర్సింలు.టి, నవీన్, బుచ్చయ్య శ్రీను, గూడూరు, బందయ్య, మల్లేష్, టీ రాజు, మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ దయాకర్ చారీ, మహేందర్, హరివర్ధన్, సంజీవ, సోషల్ మీడియా ప్రతినిధులు సమీర్, సలీం మరియు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# సాగర్ జలాల సంరక్షణపై కలెక్టర్ క్షేత్రస్థాయి సమీక్ష!

**సాగర్, గోదావరి జలాలకు త్రాగునీటికే తొలి ప్రాధాన్యత!**

**ఎన్ఎస్పీ కాలువ పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలి!**

**వి.వి. పాలెం డీప్‌కట్ వద్ద జలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**





ప్రజా వాయిస్ ఖమ్మం:
ప్రస్తుత సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో, సాగర్, గోదావరి జలాలను త్రాగునీటి అవసరాలకే మొదటి ప్రాధాన్యతగా వినియోగించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అధికారులను ఆదేశించారు. రైతులు సైతం అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పల్లెగూడెం ఎన్ఎస్పీ లింకు కెనాల్ పునరుద్ధరణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువుకు నీటి సరఫరా జరిగే మార్గంతో పాటు తూము మరమ్మత్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా త్రాగునీటి ఎద్దడి రాకుండా కాలువ, తూము పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద నీటి ప్రవాహ పరిస్థితిని, ఇంజినీర్లతో కలిసి నీటి లభ్యతను పరిశీలించారు. కాలువలు, రెగ్యులేటర్లు, అవుట్‌లెట్లలో నీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, అందుబాటులో ఉన్న నీటితో చెరువులను నింపేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇదే క్రమంలో ఏదులాపురం పరిధిలో జరుగుతున్న ఓటర్ల 'ఎస్.ఐ.ఆర్.' ప్రక్రియను సమీక్షిస్తూ, నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ హియరింగ్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో ఇరిగేషన్ సీఈ వాసంతి, ఖమ్మం ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవో శ్రీనివాస్, వైరా ఈఈ బాబురావు, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, తహసీల్దార్లు వినయేందర్ రెడ్డి, అరుణ, ఇరిగేషన్ ఏఈ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# బోధన్‌లో కాంగ్రెస్-బీఆర్ఎస్ ఢీ

**అంబేద్కర్ చౌక్ వద్ద వేడెక్కిన రాజకీయం..**

**ఇరువర్గాల నిరసనలతో ఉద్రిక్తత**





**బోధన్, ప్రజా వాయిస్:**
బోధన్ పట్టణంలో కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు అంబేద్కర్ చౌక్ వద్ద ఆందోళన చేపట్టి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన, ఎన్నికల హామీల అమలుపై నిరసనకు దిగాయి. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రెండు వర్గాలు ఒకే ప్రాంతంలో ఎదురెదురుగా చేరడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరస్పరం నినాదాలు, వాగ్వాదంతో కొద్దిసేపు హైటెన్షన్ వాతావరణం నెలకొంది. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. రాష్ట్ర రాజకీయాల్లో రగులుతున్న కాంగ్రెస్-బీఆర్ఎస్ పోరు ప్రభావం బోధన్‌లోనూ స్పష్టంగా కనిపించడంతో పట్టణ రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# అసెంబ్లీలో చొక్కాలు విప్పి అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటు

## మహిళా కమిషన్‌కు కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఫిర్యాదు

**ప్రజావాయిస్/ పాలకుర్తి**

తెలంగాణ అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలపై తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో మహిళా ఎమ్మెల్యేలు రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి సహచర మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి కమిషన్‌ను కలిసి లిఖితపూర్వక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేవాలయమైన అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు తీవ్ర విచారకరమని మండిపడ్డారు. అసభ్య నిరసనలపై ఆగ్రహం: మహిళా ఉద్యోగులు, మహిళా ప్రజాప్రతినిధులు ఉన్న ప్రాంగణంలో చొక్కాలు విప్పుకుని బహిరంగంగా నిరసన



తెలపడం సిగ్గుచేటని, ఇది ఏమాత్రం సమర్థనీయం కాదని ఆమె పేర్కొన్నారు. నిరసనలను ప్రజాస్వామ్యబద్ధంగా తెలపాలి తప్ప ఇలా హద్దులు దాటి ప్రవర్తించడం సరికాదన్నారు. స్పీకర్‌పై దూషణలు అన్యాయం: సభాపతి స్థానంలో ఉన్న స్పీకర్‌ను అసభ్య పదజాలంతో దూషించడం బాధాకరమని, ఆ పదవికి గౌరవం ఇవ్వాల్సిన కనీస బాధ్యత సభ్యులందరిపై ఉంటుందని తెలిపారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలకు దిగడం సరైన పద్ధతి కాదన్నారు. మహిళల గౌరవం, భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అసెంబ్లీలో జరిగిన ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళా సాధికారతకు, వారి ఆత్మగౌరవానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళలను అవమానించేలా ఎవరు ప్రవర్తించినా చూస్తూ ఊరుకోబోమని యశస్విని రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ మహిళా నేతలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ, మల్బరీ సాగుతూ ఎకరానికి రెండు లక్షల ఆదాయం

**ప్రజా వాయిస్ కొత్తగూడ**

మేర రేషమ్ - మేర అభిమాన్ 2.0 (నా పట్టు - నా అభిమానం 2.0) నూతన రైతులకు మల్బరీ సాగు లాభదాయకం

పంట మార్పిడితో ప్రతీ గ్రామంలో 50 ఎకరాలలో అధిక ఆదాయాన్నిచ్చే మల్బరీ సాగు చేయాలి.

కేంద్ర సిల్క్ బోర్డు 75 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంలో మల్బరీ సాగు విస్తీర్ణం ను పెంచే క్రమంలో నా పట్టు -నా అభిమానం 2.0 (మేర రేషమ్ - మేర అభిమాన్ 2.0) కార్యక్రమాన్ని జి .అనసూయ, జాయింట్ డైరెక్టర్, సెరికల్చర్ శాఖ వారు, కొత్తగూడ, రైతు వేదిక లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర సిల్క్ బోర్డు కర్ణాటక రాష్ట్రానికి చెందిన మైసూర్ శాస్త్రవేత్త జె. శ్రీకాంత్ నాయక్, మల్బరీ సాగు గురించి రైతులకు పలు సాంకేతిక సలహాలు ఇస్తూ పలు సందేహాలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతాంగం పంట మార్పిడి ద్వారా మార్కెట్ డిమాండ్ ఉన్న మల్బరీ సాగు చేపట్టి




ఎకరానికి 2 లక్షల ఆదాయం పొందాలని తెలిపారు. ఈ పంట ఆదాయం సాఫ్ట్వేర్ ఇంజనీర్ జీతంతో సమానం అని తెలిపారు. క్లస్టర్ స్థాయిలో సామూహికంగా మల్బరీ సాగు చేపట్టాలని దీనికి కోతులు, దొంగల బెడద లేదని, ఒక సంవత్సరం లో 5 నుండి 6 పంటలు తీసుకోవచ్చని ఎక్కువ స్థాయిలో ఎరువులు అవసరం లేదని, పురుగు మందులు అసలు అవసరం లేదని తెలుపుతు ఈ సాగు వైపు మొగ్గుచూపాలని తెలిపారు. వరి, మొక్కజొన్న, ప్రత్తి, మిరప సాగు విస్తీర్ణం తగ్గించి ఈ మల్బరీ పంటని సాగు చేసి ఆర్థికంగా ఎదగాలని తెలిపినారు. జినుగు మరియన్న జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఈ పంట సాగు వలన పరిశ్రమలు స్థాపించి యువతకు, స్వయం సహాయక మహిళా సంఘాలకు ఉపాదిని కల్పించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కనుక రైతాంగం ఆలోచించి పంట మార్పిడి ద్వారా మల్బరీ సాగు చేయాలని తెలిపినారు. ఈ కార్యక్రమం లో జాయింట్ డైరెక్టర్ జి .అనసూయ, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారిజినుగు మరియన్న , కేంద్ర సిల్క్ బోర్డు శాస్త్రవేత్త జే . శ్రీకాంత్, బెంగళూరు, సెరికల్చర్ అధికారి కే సురేష్, మండల వ్యవసాయ అధికారి జే ఉదయ్, ఉద్యాన శాఖ అధికారి శాంతి ప్రియదర్శిని, మండల ఐకేపీ ఎ. పి.ఎం రవీందర్, వ్యవసాయ విస్తరణ అధికారులు రాజు, రాజ్ కుమార్, ఉద్యాన విస్తరణ అధికారులు బి రమేష్, టి . విజయ పాల్ రెడ్డి, రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి

## మండల అధ్యక్షుడు బానోత్ రూఫ్ సింగ్

**ప్రజా వాయిస్ కొత్తగూడ**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మీడియా సమావేశం నిర్వహించిన కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బానోత్ రూఫ్ సింగ్ వారు మాట్లాడుతూతెలంగాణ శాసనసభ స్పీకర్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుచేసినవ్యాఖ్యలనుఖండిస్తూతెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కేబినెట్ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్య ఉమా మురళి నాయక్ సూచనల మేరకు.. కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బానోత్ రూఫ్ సింగ్ నేతృత్వంలో నిరసన తెలిపారు తాతా మధు సభ్యత్వం రద్దు చేసి వారిపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బహిరంగ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీడిమాండ్ రాజ్యాంగబద్ధమైన



పదవిలో ఉన్న గౌరవ పెద్దలుఅసెంబ్లీ స్పీకర్ నుఅవమానించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేననిఅన్నారు. తాత మధు వ్యాఖ్యలపై బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సమాధానం చెప్పాలని ఇలాంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఉపేక్షించబోదని హెచ్చరిస్తూ వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తగు చర్యలుతీసుకోవాలని కోరుతున్నది కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ చల్లా నారాయణరెడ్డి,ఎన్నికల ఇంచార్జి , సీనియర్ మాజీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య,స్థానిక సర్పంచ్ మల్లెల భాగ్యమ్మజిల్లా కార్యవర్గ సభ్యులు వీరనేని వెంకటేశ్వర్లు,సీనియర్ నాయకులు రాజం సారంగం , నోముల ప్రశాంత్ యాదవ్ జిల్లా యూత్ జనరల్ సెక్రెటరీ జిల్లా ఎస్టీ సెల్ జనరల్ సెక్రెటరీ సీనియర్ నాయకులు బోడ ఈరియా నాయక్ , బొల్లు రమేష్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సంపేట మండల అధికార ప్రతినిధి ఇర్ప రాజేశ్వర్, వెలుదండి వేణు సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చొప్పరి కుమార్, గుంజేడు ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బూర్కా నరేందర్, వజ్జ అక్షయ్ వర్మ సర్పంచ్ వేలుబెల్లి, తొలేం అనంతరావు సర్పంచ్. గుంజేడు, ఈరియా నాయక్ సర్పంచ్ పొగుళ్ళపల్లి,బ్లాక్ ప్రధానకార్యదర్శి కేఉపేంద్రచారి,చెన్నూరిమహేందర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులువజ్జబాలరాజు,సిద్ధబోయినలక్ష్మీనారాయణ, బోయినేని ప్రశాంత్ రెడ్డి , యాదగిరి కిరణ్ గౌంది రాజు , బూర్కా మల్లయ్య, పెండ్లీ రాజా శేఖర్, టెంట్ వెంకన్న,గట్టిరామస్వామి , ముడికేసంతోష్, ఎండి మౌలానా, నాలి బాలకృష్ణ,రాజు,తదితరులు పాల్గొన్నారు

# గణేష్ ఉత్సవాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

## ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలి

## ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు

**ప్రజా వాయిస్ వేములపల్లి**



గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించే నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని వేములపల్లి ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఆయన సూచించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు ముందుగానే పోలీసులకు సమాచారం అందిస్తే మండపాల వివరాలను నమోదు చేసుకుని, ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు, సలహాలు అందిస్తామని ఎస్ఐ తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# మహిళా ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా నిజామాబాద్ అర్బన్

## మహిళా నేతల ధర్నా



**నిజామాబాద్, ప్రజా వాయిస్ సెప్టెంబర్ 8:** అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేలు శ్రీమతి సునీతా లక్ష్మారెడ్డి, శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి పై జరిగిన దాడిని నిరసిస్తూ నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో బీఆర్ఎస్ మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి నిలయమైన అసెంబ్లీ ఆవరణలో మహిళా ప్రజాప్రతినిధులపై దాడి జరగడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడికి బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాలి - ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అంటూ నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతుకిరణ్,మాజీ కార్పొరేటర్లు విశాలిని రెడ్డి, సిర్ప సువర్ణ,మంజుల యాదవ్,చింతకాయల అలేఖ్య,గంగ ,సంధ్య తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఆగమనంలో డీజేలకు అనుమతి లేదు

## డీజేలు, సౌండ్ బాక్సులు పెడితే సీజ్ యజమానులపై కేసులు

## మండపాల వద్ద సీసీ కెమెరాలు, 24 గంటలూ వాలంటీర్లు ఉండాలి

## దోమకొండ ఎస్సై ప్రభాకర్ హెచ్చరిక



**ప్రజా వాయిస్ దోమకొండ, సెప్టెంబర్ 8:** గణేష్ విగ్రహాల ఆగమన కార్యక్రమంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని దోమకొండ ఎస్సై ప్రభాకర్ హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. గణేష్ విగ్రహాలను గ్రామాలకు తీసుకువచ్చే సమయంలో 'ఆగమనం' పేరుతో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజే సిస్టమ్స్, సౌండ్ బాక్సులు వినియోగించరాదని ఎస్సై స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు, సౌండ్ బాక్సులు ఏర్పాటు చేస్తే వాటిని సీజ్ చేయడంతో పాటు సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**ఆన్‌లైన్‌లో మండపాల వివరాలు నమోదు చేయాలి**

గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ రూపొందించిన పోర్టల్ ద్వారా మండపానికి సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్సై సూచించారు. భద్రతా బందోబస్తు, పోలీసుల సమన్వయం కోసం గణేష్ మండపాల ఆన్‌లైన్ ఇంటిమేషన్ ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. మండప వివరాలను జూశీశ్రీఱవజూశీఞ్రీ.ంజూశీ-శ్రీఱవ.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్‌లో నమోదు చేసి, దరఖాస్తును సంబంధిత పోలీస్ స్టేషన్‌కు అందించాలని సూచించారు.



# కొత్త కూరగాయల మార్కెట్ రోడ్డును వెంటనే నిర్మించాలి

## -సిపిఐ ఫ్లోర్ లీడర్ సూర్య, నగర కార్యదర్శి కనకరాజు డిమాండ్

**ప్రజా వాయిస్ గోదావరిఖని**

కొత్త కూరగాయల మార్కెట్ సమీపంలో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సీపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, నగర కార్యదర్శి కే. కనకరాజు డిమాండ్ చేశారు. మంగళవారం శివాజీనగర్ సీపిఐ శాఖ ఆధ్వర్యంలో నాయకులు సమస్య ఉన్న ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రామగుండం నియోజకవర్గంతో పాటు కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయని ఆరోపించారు. ప్రతిరోజూ వేలాదిమంది వచ్చే కూరగాయల మార్కెట్ రోడ్డు గత ఏడాదిన్నరగా గుంతలమయమై వర్షపు నీటితో అల్లాడుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఛాంబర్లు ఆరు నెలలకే ధ్వంసం కావడం పనుల నాణ్యతకు నిదర్శనమన్నారు. ?రూ. 800 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న ఎమ్మెల్యే, మేయర్‌లకు క్షేత్రస్థాయి పరిశీలన లేదని విమర్శించారు. అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్లను వెంటనే పూర్తి చేయకపోతే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, జిల్లా నాయకులు తాళ్లపల్లి మల్లయ్య, శివాజీనగర్ శాఖ కార్యదర్శి రాణవేణి సుధీర్ కుమార్, నాయకులు రేణిగుంట్ల ప్రీతం, పోతరాజు నాగరాజు, సాధుల శివ, షేక్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళ సంఘాల గోదాం భవన నిర్మాణానికి స్థలం పరిశీలన

**ప్రజా వాయిస్ దోమకొండ సెప్టెంబర్ 8**

ప్రభుత్వం మహిళల అభివృద్ధి, అభ్యున్నతి కోసం వ్యవసాయ గోదాంలు మొక్కజొన్న ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు లో భాగంగా దోమకొండ మండలానికి గ్రామీణ అభివృద్ధి శాఖ జిల్లా అదనపు పిడి విజయ లక్ష్మి స్థల పరిశీలన చేశారు. మహిళ సంఘాల గోదాం భవనాలకు స్థలం గురించి తహసిల్దార్ మాట్లాడుతూ మహిళ రైతులు పండిస్తున్న పంటలను కొనుగోలు మరియు అమ్మకాలు చేస్తున్న క్రమంలో సరియైన ధర పొందడానికి ఈ గోదాంలు ఉపయోగపడతాయన్నారు. పంటల సాగు ద్వారా వచ్చే విత్తనాలను ప్రాసెసింగ్ చేసి, ప్యాక్ చేసి మహిళా పారిశ్రామిక వేత్తలను చేయాలని ప్రభుత్వం దృడ సంకల్పంతో ఉందని తెలిపారు. రెండు యూనిట్లు ఏర్పాటు చేయు స్థలాన్ని దోమకొండ రెవెన్యూ ఇన్స్పెక్టర్ దోమకొండ లోని పలుగడ్డ ప్రాంతంలో స్థలం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఐకెపి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్ కుమార్, ఇక్రిశాట్ కో ఆర్డినేటర్లు యశ్వంత్, దోమకొండ ఏపిఎం శ్రీనివాస్, సి ఈ ఓ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 18 న మహా ధర్నాను విజయవంతంచేయండితుడుందెబ్బపిలుపు

**మండల కేంద్రం లో కరపత్రం ఆవిష్కరణ**

**ఎస్ టి జాబితా నుండి లంబాడి లను తొలిగించుటకు కమిషన్ నియమించాలి**

**తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు వట్టం ఉపేందర్**

**ప్రజా వాయిస్ కొత్తగూడ**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లో ఆదివాసీ ఆత్మ గోషా కరపత్రం ఆవిష్కరణ చేయడం జరిగింది అనంతరం తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు వట్టం ఉపేందర్, జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ...సెప్టెంబర్ 18 న తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఇంద్ర పార్క్ లో ఆదివాసీ ఆత్మ గోషా మహా ధర్నా కార్యక్రమం షెడ్యూల్ తెగల జాబితా నుండి (ఎస్ టి ల నుండి) లంబాడి లను తొలిగించుటకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కమిషన్ నియమించాలని ఇంద్ర పార్క్ వద్ద జరుగు మహ ధర్నా ను విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ, ఆధార్ సోసైటీ, సంఘాలు పిలుపునిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో భారత రాజ్యాంగానికి విరుద్ధంగా లంబాడీలను ఎస్ టి జాబితాలో చేర్చడంతో రాజస్థాన్ లో ఓసీ ,మహారాష్ట్రలో ఉన్న బీసీలు, కర్ణాటకలో ఉన్న ఎస్సీలు విపరీతంగా తెలంగాణ ప్రాంతానికి వలస వచ్చి ఆదివాసులకు అందవలసిన విద్య ఉద్యోగ రాజకీయ పరమైన రిజర్వేషన్ కొల్లగొడుతున్నారని వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించుటకు కమిషన్ నియమించేంతవరకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించి పోరాటం చేయాలని తెలంగాణ రాష్ట్ర నడి బొడ్డులో ఇంద్ర పార్క్ వద్ద జరిగే ఆదివాసీల ఆత్మ గోషా మహా ధర్నాకు ఆదివాసీ ప్రజలు,విద్యార్థులు, ఉద్యోగులు మహిళలు ప్రజా స్వామిక వదులు వేలాదిగా కదిలీరవాలని పిలుపునిస్తున్నాం.ఈ కార్యక్రమం లో



ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు వట్టం ఉపేందర్, రమణాల లక్ష్మయ్య తుడుం దెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్క యాదగిరి, వట్టం కన్నయ్య, పూనేం సందీప్ తుడుం దెబ్బ మండల అధ్యక్షులు కొత్తగూడ, మల్లెల సారయ్య కొత్తగూడ మండల ప్రధాన కార్యదర్శి, తుడుం దెబ్బ మండల కమిటీ సభ్యులు ఈసం వెంకన్న, బీజ్జ సందీప్,బుర్క శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు




# రుణ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలి

**అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు అందేలా చర్యలు: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

**నిర్మల్, ప్రజావాయిస్ :**

జిల్లాలో నిర్దేశించిన వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను వంద శాతం సాధించేలా బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. అర్హులైన రైతులు, విద్యార్థులు, యువత, మహిళా స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులకు సకాలంలో రుణాలు అందించాలని సూచించారు.2026-27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో బ్యాంకులకు రూ.7,952.87 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించగా ఇప్పటివరకు రూ.2,331.18 కోట్లు (29.31 శాతం) సాధించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రాధాన్యతా రంగాల్లో రూ.6,661.73 కోట్ల లక్ష్యానికి రూ.1,847.71 కోట్లు (27.74 శాతం) సాధించారని పేర్కొన్నారు.విద్యా రుణాల మంజూరును పెంచాలని, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ పథకాల అమలును వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. విజయ డెయిరీతో టైఅప్ ద్వారా రైతులకు పాడి పశువుల కొనుగోలుకు రుణాలు అందించే కార్యక్రమాన్ని కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు.

**నిర్మల్ ప్రజావాయిస్**



# ఎయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు...

**బీబీ నగర్లో ఎయిమ్స్ ను పరిశీలించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...**

**నిజామాబాద్, ప్రజా వాయిస్ సెప్టెంబర్ 8 :**

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. భువనగిరి జిల్లా బీబీ నగర్లో గల ఎయిమ్స్ ( ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా వైద్య సేవలు అందుతున్నాయన్నారు. మొత్తం 750 బెడ్ లతో నిర్మిస్తున్న ఎయిమ్స్ లో ప్రస్తుతం 260 అందుబాటులో ఉన్నాయన్నారు. మరో ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రధానంగా కేవలం పది రూపాయల ఫీజుతో ఏడాదిపాటు ఓపీ పొందవచ్చన్నారు. అలాగే ఇన్ పేషెంట్ గా అడ్మిట్ అయితే ఒకరోజుకు బెడ్ ఛార్జీ కేవలం రూ.35 తీసుకుంటారన్నారు. కావున పేద మధ్య తరగతి కుటుంబాల వారు వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం 25 ప్రధాన విభాగాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. దీర్ఘ కాలిక వ్యాధులు, అత్యవసర వైద్యం కావలసిన వారు ఎయిమ్స్ లో చికిత్స పొందాలన్నారు. అవసరమైన వారు తమను సంప్రదిస్తే రిఫర్ చేస్తామని తెలిపారు.

# ప్రజారోగ్య రక్షణలో ఫిజియోథెరపీ కీలక పాత్ర

**ఆరోగ్య సమస్యల నుండి కోలుకోవడంలో ఫిజియోథెరపీ**

**వరల్డ్ ఫిజియోథెరపీ డే కార్యక్రమం లో నిజామాబాద్ సిపి సాయి చైతన్య**

**ప్రజా వాయిస్ నిజామాబాద్/**

ఫిజియోథెరపీ సేవలు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకం పాత్ర పోషిస్తుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య చెప్పారు.వరల్డ్ ఫిజియోథెరపీ డే వేడుకల్లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నార. వరల్డ్ ఫిజియోథెరపీ డే ప్రాధాన్యతను వివరించడంతో పాటు ఫిజియోథెరపీ రంగంలో నిపుణులు అందిస్తున్న సేవలను అభినందించారు.పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ , ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫిజియోథెరపీకి ఎంతో ప్రాధాన్యత ఉందని అన్నారు. ప్రమాదాలు , గాయాలు , శస్త్రచికిత్సలు , కీళ్ల మరియు కండరాల సమస్యలు , నడకకు సంబంధించిన ఇబ్బందులు తదితర సమస్యల నుంచి కోలుకోవడంలో ఫిజియోథెరపీ చికిత్స ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ప్రస్తుత జీవన విధానంలో శారీరక శ్రమ తగ్గిపోవడం , ఎక్కువ సమయం కూర్చుని పనిచేయడం, వ్యాయామం చేయకపోవడం వంటి కారణాలతో అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ రోజువారీ



జీవితంలో తగినంత శారీరక వ్యాయామం , నడక మరియు ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా రోగులకు కేవలం చికిత్స అందించడం మాత్రమే కాకుండా , వారు తిరిగి సాధారణ జీవన విధానానికి చేరుకునేలా పునరావాసంలో ఫిజియోథెరపిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఫిజియోథెరపీ రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదానం ఇచ్చినటువంటి దాతలకు ప్రశంస పత్రాలు ఇచ్చి అభినందించారు.కార్యక్రమంలో నిజామాబాదు మేయర్ ఉమా రాణి కరాటే రమేష్, డాక్టర్ శివకుమార్ ఫిజియోథెరపీ ప్రెసిడెంట్ , డాక్టర్ అశ్విని జోషి వైస్ ప్రెసిడెంట్ , డాక్టర్ ప్రమోద్ కుమార్ జనరల్ సెక్రెటరీ , డాక్టర్ కీర్తి గుప్తా ట్రెజరర్ ఫిజియోథెరపిస్టులు , వైద్యులు , ఆరోగ్య సిబ్బంది , విద్యార్థులు , నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



# రేడియల్ రోడ్డు మార్గాన్ని తక్షణమే మార్చాలి

**షాబాద్ తహశీల్దార్‌కు సంకేపల్లిగూడ ఇంటి బాధితుల వినతి**

**ప్రస్తుత అలైన్‌మెంట్ వల్ల ఇళ్లు విలువైన ఆస్తులు కోల్పోతున్నామని బాధితుల ఆవేదన**

**( ప్రజా వాయిస్ షాబాద్)**

షాబాద్ మండల పరిధిలోని సంకేపల్లిగూడ గ్రామానికి సంబంధించి ప్రభుత్వం ప్రతిపాదించిన రేడియల్ రోడ్డు మార్గం అలైన్‌మెంట్ బాధితులకు తీవ్ర మనోవేదనను మిగులుస్తోంది. ప్రస్తుత మార్గం వల్ల తాము నివాసం ఉంటున్న ఇళ్లు కష్టపడి సంపాదించుకున్న ఆస్తులు పూర్తిగా నష్టపోయే పరిస్థితి దాపురించిందని సంకేపల్లిగూడ ఇంటి బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రతిపాదిత రేడియల్ రోడ్డు మార్గాన్ని మార్చాలని కోరుతూ మంగళవారం షాబాద్ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. రేడియల్ రోడ్డు నిర్మాణం పేరిట తమ ఇళ్లను కూల్చివేస్తే తాము రోడ్డున పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని కానీ నిరుపేదలైన ప్రజల ఇళ్లకు ప్రాణాలకు ఆస్తులకు తీవ్ర నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించి రేడియల్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని తహశీల్దార్‌ను కోరారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మానవతా దృక్పథంతో తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో మిద్దెం గూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, నర్సింలు మరియు సంకేపల్లిగూడ గ్రామ బాధితులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొండమల్లేపల్లి రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రేడియో హాబ్ ఏర్పాటు

**ప్రతి విద్యార్థి స్వరాన్ని వెలికి తీసే వేదిక**

**పాఠశాల కరస్పాండెంట్ ఎం ఆనంద్ రెడ్డి**

**ప్రజా వాయిస్ కొండమల్లేపల్లి మండలం సెప్టెంబర్ 8**

కొండమల్లేపల్లి పట్టణంలోని సాగర్ రోడ్ లో గల రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రేడియో హబ్ ను ప్రారంభించినైనది.రేడియో హబ్ ఏర్పాటు చేయడం వలన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పెంపొందించవచ్చు ఆంగ్ల భాషలో మాట్లాడే నైపుణ్యం, ప్రజా ప్రసంగ సామర్థ్యం మరియు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో తోటి విద్యార్థుల్ని మరి ఉపాధ్యాయుని ఇంటర్వ్యూ చేయడం ద్వారా ప్రశ్నలు అడిగే నైపుణ్యం విశ్లేషణాత్మక ఆలోచనలు వెలుపడతాయి విద్యార్థుల సృజనాత్మక ఆలోచన శక్తి మెరుగుపడుతుంది రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ ఎం ఆనంద్ రెడ్డి తెలియజేశారు అంతేకాకుండా విద్య అనేది కేవలం పాఠ్యపుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, విద్యార్థులు తమ ఆలోచనలను స్పష్టంగా వ్యక్తపరచడం స్టేజి పైన , ధైర్యంగా మాట్లాడడం, ఇతరులతో సమర్థవంతంగా సంభాషించడం వంటి నైపుణ్యాలను కూడా పరచుకోవచ్చని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.రేడియో హబ్ ద్వారా విద్యార్థులకు ప్రతిరోజూ ఆంగ్లంలో మాట్లాడే అవకాశం కల్పించడంతో పాటు న్యూస్ రీడింగ్, కథనం, ఇంటర్వ్యూలు, చర్చలు, ప్రకటనలు, ప్రసంగాలు మరియు వివిధ కమ్యూనికేషన్ ఆధారిత కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పించనున్నారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మాట్లాడటానికి ఉన్న భయం, సంకోచాన్ని తొలగించి, వారిలో ఆత్మవిశ్వాసం, స్పష్టమైన ఆలోచనా విధానం, సమర్థవంతమైన వ్యక్తీకరణ మరియు ప్రజా ప్రసంగ నైపుణ్యాలను పెంపొందించడమే పాఠశాల ప్రధాన లక్ష్యంగా పేర్కొంది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఫర్వీన్ సుల్తానా మాట్లాడుతూ, “రేడియో హబ్ కేవలం ఒక సదుపాయం కాదు. ప్రతి విద్యార్థి స్వరాన్ని వెలికితీసే వేదిక. పిల్లలు భయంలేకుండా మాట్లాడి, సంకోచం లేకుండా తమ ఆలోచనలను వ్యక్తపరచి, ఆత్మవిశ్వాసంతో భవిష్యత్తులో నాయకులుగా ఎదగడానికి ఇది దోహదపడుతుంది” అని తెలిపారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో అవసరమని, ఇంటి వద్ద కూడా పిల్లలను ఆంగ్లంలో మాట్లాడేలా ప్రోత్సహించాలని పాఠశాల యాజమాన్యం కోరింది.విద్యార్థులను భవిష్యత్తుకు అవసరమైన కమ్యూనికేషన్ మరియు నాయకత్వ నైపుణ్యాలతో తీర్చిదిద్దే దిశగా రైన్బో స్కూల్ చేపట్టిన ఈ రేడియో హబ్ కార్యక్రమం ఒక వినూత్నమైన ముందడుగుగా నిలుస్తోంది. తెలియజేశారు






# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై వ్యాఖ్యలకు నిరసనగా ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడించిన కామారెడ్డి నేతలు

**దళిత నాయకులను అడ్డుకుని అరెస్ట్ చేసిన జగదేవ్పూర్ పోలీసులు**

**ప్రజావాయిస్ కామారెడ్డి/**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ని, ఆయన తల్లిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి కార్యక్రమానికి దళిత నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన కామారెడ్డి జిల్లా ఎస్సీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు దళిత నాయకులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. కామారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ , నేతలు పలువురు దళిత నాయకులను గజ్వేల్ నియోజకవర్గంలోని జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా సంబంధిత నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.దళిత నాయకుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, దళితులపై జరిగే అవమానాలను ప్రశ్నించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నిరంతరం పోరాటం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

# చలో హైదరాబాద్‌కు ఉద్యోగుల కదలిక

**10న ఎల్బీ స్టేడియంలో హక్కుల సాధన సభ..**

**భువనగిరి నుంచి 10 వేల మంది తరలింపునకు ఏర్పాట్లు**

**పీఆర్సీ నివేదిక విడుదల చేయాలి.. పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలి**

**సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి: జేఏసీ జిల్లా కన్వీనర్ ధరణికోట భగత్**

**ప్రజావాయిస్/బొమ్మలరామారం:**

ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ ధరణికోట భగత్ డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న ‘చలో హైదరాబాద్--హక్కుల సాధన సభ’కు జిల్లా నుంచి వేలాది మంది ఉద్యోగులు తరలివెళ్లనున్నట్లు తెలిపారు. జిల్లాలోని భువనగిరి నుంచి సుమారు 10 వేల మంది ఉద్యోగులను సభకు తరలించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు.బుధవారం బొమ్మలరామారంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో జేఏసీ నాయకులు సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి మూడేళ్లు పూర్తయినా ఇప్పటివరకు ప్రభుత్వం నివేదిక తీసుకోలేదన్నారు. ఉద్యోగులకు సంబంధించిన ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల కోసం ప్రభుత్వం జారీ చేసిన ఈహెచ్ఎస్ జీవో అమలు కావడం లేదని, ప్రైవేట్ ఆస్పత్రులు సైతం ఈహెచ్ఎస్‌ను అంగీకరించకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని భగత్ తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో ఎంపీడీవో శ్యామల, ఉపాధ్యాయ సంఘ నాయకులు యాదయ్య, రమేష్, రాములు, మురళీధర్‌రెడ్డి, మెడికల్ అండ్ హెల్త్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగయ్య, పంచాయతీరాజ్ శాఖకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి, శశికాంత్‌గౌడ్, టీఎన్జీవో జిల్లా నాయకులు ఖదీర్, శ్రీనివాస్, మహిళా నాయకురాలు శోభారాణి, పెన్షనర్ సంఘం నాయకుడు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

